ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 16 నవంబరు 2024



ప్రజాదర్బార్‌లో సమస్యలు వింటున్న ఎంపీ పుట్టా

సంతృప్తికరమైన సేవలందిస్తా: ఎంపీ

ఏలూరు టూటౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలకు సంతృప్తికరమైన సేవలందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టసభల్లో అడుగుపెట్టే అవకాశం కల్పించిన నియోజకవర్గ ప్రజల నమ్మకాలను వమ్ము చేయనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తానన్నారు. ప్రతీ మండలంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు జాబితా సిద్ధం చేసుకున్నట్టు తెలిపారు.

ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ఏలూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉచిత ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర గనుల శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా అన్నారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో ఉచిత ఇసుక విధానాన్ని సమీక్షించారు. జిల్లా నుంచి కలెక్టర్ వెట్రిసెల్వి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 19న మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ఆ రోజు నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకునే వారిని పంచాయతీ స్థాయిలో గుర్తించి బహుమతులు ప్రకటించాలన్నారు. సమావేశంలో డీపీవో కె.అనూరాధ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ త్రినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు శ్రీ చోడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయంలో జ్వాలా తోరణం..



ప్రత్యేక అలంకరణలో భీమవరం సోమేశ్వరస్వామి.. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి



ఆచంటలో అఖండ జ్యోతి

కార్తీక వైభవం

'హరోం హర.. ఓం నమశ్శివాయ.. శంభో శంకరా..' అంటూ భక్తుల శివ నామస్మరణతో జిల్లాలోని శైవ క్షేత్రాలు మర్మోగాయి. శుక్రవారం వేకువజాము నుంచే ఆలయాలు పోటెత్తాయి. వేలాది మంది సమక్షంలో ఆచంట శ్రీ ఉమా రామేశ్వరస్వామి ఆలయం వద్ద అఖండ జ్యోతి(కర్పూర జ్యోతి)ని వెలిగించారు. ఆవు నెయ్యి వేసేందుకు క్యూ కట్టారు. పంచారామ క్షేత్రాలైన పాలకొల్లు, భీమవరంతోపాటు పట్టిసీమ క్షేత్రాలు కిటకిటలాడాయి. రాత్రి జ్వాలా తోరణం వెలిగించారు. 6లో

ఆగి..చూసి..వెళ్లండి..!



అశోక్ నగర్ మూడురోడ్ల కూడలిలో..

ఏలూరు నగరంలోని రోడ్లపై ఆదమరిచి వెళ్లితే అంతే సంగతులు. రోడ్డు మధ్యలో ఆకస్మాత్తుగా ఎదురయ్యే గొయ్యిలు ప్రమాదకరంగా మారాయి. అశోక్ నగర్ మూడురోడ్ల సెంటర్‌లో అండర్‌డ్రెయినేజీపై మ్యాన్‌హోల్ మూత ప్రమాదకరంగా మారడంతో హెచ్చరికగా ఓ కర్రకు క్లాత్ చుట్టి పెట్టారు. రాజీవ్ గాంధీ పార్కు సమీపంలో రోడ్డు మధ్యలో మురుగు డ్రెయినేజీ పైన రోడ్డు ధ్వంసం కావడంతో రాళ్లు అడ్డుపెట్టి చేతులు దులుపుకున్నారు. రాత్రివేళలో వాహనదారులు, పాదచారులు ఏమాత్రం ఆదమరుపుగా ఉన్నా ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి వీటిని మూసివేయాలని నగరవాసులు కోరుతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



రాజీవ్‌గాంధీ పార్కు సమీపంలో రోడ్డు మధ్యలో ఇలా..



కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

- సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1 నుంచి దీక్షలు
- అసెంబ్లీకి వెళ్లకపోవడమంటే ప్రజలను అవమానించడమే
- జగన్ రాజీనామా చేయాలి
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్ 7

గడువులోగా పీఎం ఫసల్ బీమా ప్రీమియం చెల్లించండి

ఏలూరు సిటీ, నవంబరు15(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం 2024 కింద వరి పంటకు ప్రీమియం చెల్లించడానికి డిసెంబరు 31, మొక్కజొన్న, మినుము, పెసర పంటలకు ప్రీమియం చెల్లించడానికి డిసెంబరు 15వ తేదీ ఆఖరు తేదీలుగా నిర్ణయించారని, ఆ గడువులోగా రైతులు తమ పంటలను నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా శుక్రవారం తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులు కట్టాల్సిన ప్రీమియం మొత్తాలను ప్రభుత్వమే చెల్లించిందని, ప్రస్తుతం రబీ 2024-25కు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులే ప్రీమియం చెల్లించాల్సి ఉందన్నారు.

- మామిడి, జీడిమామిడి తోటలకు సంబంధించి వాతావరణ ఆధారిత పంట బీమా సౌకర్యాన్ని రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి డా. ఎస్. రామ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో సుమారు 36 వేల ఎకరాల మామిడి పంట సాగులో ఉందన్నారు. మొదటిసారిగా మామిడి పంటకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంట బీమాను కల్పిస్తోందన్నారు. ఇందులో ఎకరానికి రూ. 45 వేలు నష్టపరిహారం పొందవచ్చన్నారు. రైతులు ఈ-పంటలో ఖచ్చితంగా పంట నమోదు చేసుకుని ఉండాలని, డిసెంబరు 15లోగా ఎకరానికి రూ. 2,250 ప్రీమియం చెల్లించాలన్నారు. నవంబరు 22వ తేదీలోగా జీడి మామిడి పంటకు ఎకరాకు ప్రీమియం రూ. 1500 చెల్లించాలని, ఎకరానికి గరిష్టంగా చెల్లించే బీమా రూ. 30వేలు అని తెలిపారు.



సిబ్బంది సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్పీ

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పని చేస్తున్న సివిల్ పోలీసులు, ఏఆర్ పోలీసులు, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఏలూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమ దివాస్ శుక్రవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సిబ్బంది వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఉద్యోగంలో వారికి ఎదురవుతున్న సమస్యలు ఇతర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పల్లెకు.. పవర్



వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించింది. ఆపై సచివాలయాలను పంచాయతీల పైకి నెట్టి సర్పంచ్ వ్యవస్థనే నీరుగార్చేశారు. సర్వాధికారాలు సర్పంచ్‌లు కాకుండా సచివాలయాల చేతుల్లోకి మళ్ళాయి. గడిచిన మూడున్నరేళ్లుగా ఉన్న ఆటు పాట్లను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పంచాయతీలు అధిగమిస్తున్నాయి. ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఊళ్ళకు ఊపిరొచ్చింది.

- వైసీపీ హయాంలో సర్పంచ్‌లు, నిధులు తీసికట్టు
- బలవంతంగా సచివాలయ వ్యవస్థను నెత్తిన రుద్దారు
- కూటమి ప్రభుత్వం రాకతో పల్లెల్లో కొత్త కాంతులు
- ఉపాధి హామీకి తోడు ఆర్థిక సంఘం నిధులు
- ఆ పీడ విరగడైంది : వైసీపీ సానుకూల సర్పంచ్‌లు
- పవన్, కూటమికి జేజేలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఒకప్పుడు పంచాయతీలే అన్నింటికీ కీలకం. అయితే జగన్ హయాంలో వీటిని పూర్తిగా దెబ్బతీశారు. సర్పంచ్‌లను పక్కనపెట్టి సచివాలయ వ్యవస్థను ఊళ్ళమీద రుద్దారు. ఆఖరుకి సర్పంచ్‌లే కాకుండా ఎమ్మెల్యేలూ ఎటూ తేల్చుకోలేక ప్రజలకు ప్రత్యక్షంగా తామేమీ చేయలేక నిస్సహాయులయ్యారు. పంచాయతీలు కరెంటు బకాయిలు కట్టాలంటూ 14వ సంఘం ఆర్థిక నిధులను దారి మళ్లించారు. ఊరూరా అభివృద్ధికి నయాపైసా లేకుండా పోయింది. పారిశుధ్య సిబ్బందికి నెలవారీ జీతాలు ఇవ్వలేని పరిస్థితి. వర్షాకాలం వస్తే చిన్నాచితక పారిశుధ్య పనులు మెరుగుపర్చాలన్నా కష్టమే. జనం నుంచి శాపనార్థాలు పడుతూ సర్పంచ్‌లంతా బిక్కచచ్చిపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామసీమల సీను మారింది. వీటికి జీవం పోసేందుకు ఉప ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. ఇక అప్పటి నుంచి పంచాయతీల్లో గతంనాటి ఆటంకాలు తొలగి ఆ స్థానంలో ఒకింత 'పవర్' వచ్చింది. పంచాయతీ ఎన్నికలు జరిగి మూడున్నరేళ్లు అయినా కనీసం తట్టెడు మట్టి ఎత్తలేని పంచాయతీల్లో ఏకంగా రూ.102 కోట్లతో ఉపాధి హామీ పనుల అమలును వీటి ముందుంచారు. జిల్లా వ్యాప్తం గా ఉన్న 847 పంచాయతీల పరిధిలో రోడ్ల మరమ్మతులు, పశువులకు షెడ్లు నిర్మించేందుకు అనువుగా వచ్చే సంక్రాంతికి పూర్తయ్యేలా ప్రత్యేక కార్యాచరణ తీసుకొచ్చారు. తాము గెలిచిన తర్వాత తొలిసారిగా తమకు బాధ్యతగా అప్పగించిన పని ఇదేనని సర్పంచ్‌లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పంచాయతీలకు రావాల్సిన 14వ ఆర్థిక సంఘం నిధులు కరెంటు బకాయిల పేరిట జగన్ ప్రభుత్వం వాడేసింది. ఇప్పుడు తాజాగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల య్యాయి. వీటన్నింటినీ గ్రామసీమల అభివృద్ధికే యథావిధిగా వాడతామని పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కల్యాణ్ ఈ మధ్యనే ప్రకటించారు. సరాసరిన ఇప్పుడు ఏర్పడిన కొత్త జిల్లాలకు కూడా తల ఒక్కింటి చొప్పున నిధులు లభిస్తాయి. దీంతో మరిన్ని పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంది.

పల్లె సీను మారింది

గత పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో అత్యధికంగా వైసీపీ సానుకూలురే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. మొత్తం 847 పంచాయతీల్లో ఏకగ్రీవం, పోటీ కారణంగా దాదాపు 750 మందికి పైగానే వైసీపీ సానుకూలురు గెలిచారు. పార్టీ సానుభూతితో వీరందరినీ గెలిపించి నా అధికారం విషయం వచ్చేసరికి వీరందరినీ పక్కనపెట్టేశారు. తమ సానుభూతిపరుడు సర్పంచేలేన్నట్టుగా వైసీపీ వ్యవహరించింది. ఈ పరిస్థితి మూడున్నరేళ్లు సాగినా ఇప్పుడు మళ్ళీ పవర్ చేతికొస్తుండడంతో వైసీపీ సానుకూలురే ఆ పార్టీకి పూర్తిగా రివర్స్ అయ్యారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఇదే పద్ధతిని అనుసరించారు. ఇప్పుడు పవన్ కల్యాణ్ ఉత్సాహంతో గ్రామాలకు జీవం వచ్చిపడడంతో వైసీపీ సానుభూతిపరులే పవన్‌కు, కూటమి ప్రభుత్వానికి జేజేలు పలకడం విశేషం. దీనికితోడు ఈ మధ్యనే పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన అనేక మంది సర్పంచ్‌లు మీరు వచ్చిన తర్వాత పరిస్థితి మారింది, పల్లెకు ప్రాణం వచ్చింది, మాకు ఉత్సాహం వచ్చిందంటూనే తమకు వేతనాలు పెంచాలంటూ అభ్యర్థించారు. మూడు వేల నుంచి పది వేలకు పెంచాలన్నదే సర్పంచ్‌ల దీర్ఘకాలిక డిమాండ్. కరెంటు చార్జీలకు సంబంధించి పంచాయతీలపై భారం వేస్తున్నారని, తాగునీటి సరఫరాకు, వీధిలైట్లకు అయ్యే మొత్తం వ్యయాన్ని సరిగ్గా అంచనా వేసేందుకు అనువుగా మీటర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేశారు. దీనిని సీఎం దృష్టికి తీసుకువెళ్తానని పవన్ హామీ ఇచ్చారు. దీంతో పల్లెల్లోను కూటమి ప్రభుత్వానికి అను కూల సంఘీభావం మరింత పెరిగినట్టయ్యింది. ఇదే సమయంలో వైసీపీకి క్షేత్రస్థాయిలోను చేష్టలుడిగాయి.

పల్లెలు బాగు పడుతున్నాయి..



ఇంతకుముందున్న పరిస్థితులు మారి పల్లెల కు పవర్ వచ్చింది. సర్పంచ్‌లు తలెత్తుకు తిరు గుతున్నారు. పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కల్యాణ్ చొరవ, కూటమి ప్రభుత్వ నిర్ణయాల కారణంగా చేతినిండా పనులకు గ్రామాల్లో అవకాశం వచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులు, ఈ మధ్యనే ఉపాధి హామీ కింద కేటాయించిన నిధులతో రాబోయే కొద్ది రోజుల్లోనే పల్లె స్వరూపమే మారబోతుంది.

– పిల్లి సత్తిరాజు, గౌరవ అధ్యక్షుడు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం

లో ఓల్టేజీకి చెక్

- రూ. 2.73 కోట్లతో 255 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు
- పీఎం సూర్యఘర్ యోజనలో 157 మందికి సోలార్ ప్యానెల్స్
- ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు రూ.35.60 కోట్ల రాయితీ
- పది 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఏలూరు సిటీ, నవంబరు 15 : 'జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో అక్కడక్కడా లోఓల్టేజీ సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. జిల్లాలో లోఓల్టేజీ సమస్య నివారణకు రూ. 2.73 కోట్లతో 255 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని కొత్తగా జిల్లాలో విద్యుత్ లైన్లు, కొత్తగా విద్యుత్ ఫీడర్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు ప్రారంభించాం. జిల్లాలో గృహ, వాణిజ్య వినియోగ దారులతో పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు సంబంధించి నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం' అని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన జిల్లాలో విద్యుత్ శాఖ ప్రగతిని సమగ్రంగా వివరించారు.

- ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంలో భాగంగా జిల్లాలో 469 మంది వినియోగదారులు నమోదు చేసుకోగా వీరిలో 157 మంది గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశాం.
- విద్యుత్ వినియోగం నెలకు 200 యూనిట్లు వరకు ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు ఉచిత విద్యుత్ పంపిణీలో భాగంగా జిల్లాలో 57,566 ఎస్సీ వినియోగదారులకు రూ.25.95 కోట్లు, 18,172 ఎస్టీ వినియోగదారులకు రూ. 5.65 కోట్ల కలిపి మొత్తం 75,738 మందికి రూ.35.60 కోట్లు 2023-24 సంవత్సరంలో రాయితీగా ఇచ్చాం.
- జిల్లాలో 153 విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో 400/200 కేవీ ఉపకేంద్రం ఆడమిల్లిలో, రెండు 200/132 కేవీ ఉప కేంద్రాలు, 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలు 9, 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాలు 141 ఉన్నాయి. కొప్పాకలో రూ.119.79 కోట్లతో 200/132 /33 కేవీ విద్యుత్ ఉప కేంద్రం మంజూరైంది. జిల్లాలో రూ. 47 కోట్లతో ధర్మాజీగూడెంలో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో రూ. 10.57 కోట్లతో నూతనంగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు కొత్తూరు మర్రిగూడెం, మార్కండేయపురంలో మంజూరయ్యాయి.
- జిల్లాలో రూ. 29.82 కోట్లతో నూతనంగా పది 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేశాం.
- రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.8.64 కోట్లతో 60.7 కిలోమీటర్లు విద్యుత్ లైన్, 21 ప్రాంతాల్లో 11 కేవీ విద్యుత్ ఫీడర్లు ఏర్పాటు చేశాం. ఇంకా జిల్లాలో 22 కిలోమీటర్లు మేర విద్యుత్ లైను, 19 చోట్ల 11 కేవీ ఫీడర్లు ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో లోఓల్టేజీ సమస్యలు అధిగమించడానికి రూ.0.88 కోట్లతో కొవ్వలిలోని యాదవ నగర్, చింతలపూడి, తంగెళ్ళమూడి, శాంతినగర్, శని వారపుపేట, ఏలూరు, ఏపూరు, కలపర్రుల్లో రెండు 63 కేవీ, నాలుగు 100 కేవీ, ఒక 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు గత ఆర్థిక సంవత్సరంలో ఏర్పాటు చేశాం.
- రూ.2.73 కోట్లతో గ్రామాల్లో, పట్టణాల్లో లోఓల్టేజీ సమస్యలను అధిగమించడానికి 255 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశాం.
- జిల్లాలో గృహ విద్యుత్ వినియోగదారులు 4,57,918 మంది, గృహేతర విద్యుత్ వినియోగదారులు (వాణిజ్య) 54,663 , పరిశ్రమ విద్యుత్ వినియోగ దారులు 1440, సంస్థాగత విద్యుత్ వినియోగదారులు 11,356, వ్యవసాయ , ఇతర విద్యుత్ వినియోగ దారులు 77, 430, వ్యవసాయ విద్యుత్ వినియోగ దారులు 72,452, ఆక్వా విద్యుత్ వినియోగదారులు 4854 మంది ఉన్నారు.
- ఈ ఆర్థిక సంవత్సరం 2024-25లో 232 వ్యవసాయ పంపుసెట్లకు విద్యుద్దీకరణ చేయడంలో భాగంగా రూ.7.42 కోట్లు రాయితీ ఇచ్చాం.
- జిల్లాలో నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తున్నాం. విద్యుత్ బకాయిలు వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ జరుగుతోంది.



బొమ్మ చెరిపేలా
సర్వే రాళ్లపై జగన్ చిత్రం తొలగింపునకు ఆదేశం 6

హలో.. సుప్రీంకోర్టు నుంచి మాట్లాడుతున్నాం
మీపై కేసు నమోదైంది.. షూరిటీ బెయిల్‌కు సొమ్ము చెల్లించాలి

రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో బెదిరింపు
రూ.16.55 లక్షలు అపహరణ
పోలీసులను ఆశ్రయించిన బాధితుడు.. కేసు నమోదు 7


పెనుగొండ మండలం సిద్ధాంతం గోదావరి రేవులో దీపారాధన


భక్తులతో కిటకిటలాడిన నరసాపురం వలంధర్ రేవు


పట్టిసీమ క్షేత్రం వద్ద గోదావరి హారతి పూజలు


భీమవరం సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

శివోహం

కిటకిటలాడిన శైవ క్షేత్రాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. భీమవరంలోని సోమేశ్వరస్వామి ఆలయం లో మహిళలు 365 ఆవు నేతి వత్తులను వెలిగించారు. సాలగ్రామ, ఉసిరి, దానాలు చేసుకున్నారు. నవ వధువులతో కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లకు పసుపు, కందమొక్క, బియ్యం, జాకెట్టు ముక్కతో వాయినం అందించారు. కార్తీక చంద్ర దర్శనం చేసుకుని ఉపవాస దీక్ష విరమించారు. రాత్రి ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించారు. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆచంటేశ్వరుడి ఆలయం వేకువజాము నుంచి సాయంత్రం వరకు భక్తులతో పోటెత్తింది. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పట్టిసీమ శివక్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి బిల్వార్చన, భస్మార్చన ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. పట్టిసీమ ఫెర్రీ రేవులో గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఏక దీప హారతి, త్రిదీప హారతి, పంచదీప హారతి, అష్టోత్తర దీపహారతి, కుంభ హారతి , ధూప హారతి నిర్వహించారు. అనంతరం పట్టిసీమలో జ్వాలా తోరణం కార్యక్రమం నిర్వహించారు. గోదావరి హారతి కార్యక్రమంలో వేద పండితులు అర్చకులు, అధిక సంఖ్యలో భక్తులు సిద్ధాంతం వశిష్ట గోదావరి పంచ హారతులు వైభవంగా నిర్వహించారు. ఏక ముఖ, ద్విముఖ, చతుర్ధ పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణకుంభ, సర్ప హారతుల కార్యక్రమం నిర్వహించారు. పంచహారతుల సందర్భంగా గోదావరి తీరం భక్తులతో కిటకిటలాడింది. నరసాపురం గోదావరి తీరంలో వలంథర్ రేవు భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోదావరిలో స్నానాలు చేసి కార్తీకదీపాలు విడిచి పెట్టారు. పలువురు గట్టుపై నోములు నోచుకున్నారు.

భీమవరం టౌన్, పాలకొల్లు అర్బన్, ఆచంట, పోలవరం, పెనుగొండ, నరసాపురం టౌన్



ఆచంటేశ్వర క్షేత్రంలో

అఖండ జ్యోతి

ఆచంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తుల శివనామ స్మరణ మధ్య శుక్రవారం సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) ప్రజ్వలన జరిగింది. ముందుగా గంధర్వ మహల్‌కు చెందిన గొడవర్తి వంశీయులు కృత్తికా నక్షత్ర హోమం, మండపారాధన, మహా నైవేద్యం, ధూపసేన నిర్వహించి అనంతరం కర్పూర జ్యోతిని వెలిగించారు. కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేయడానికి భక్తులు పోటీ పడ్డారు. సుమారు పది వేల మంది భక్తులు కర్పూర జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు వెలిగించిన అఖండ జ్యోతి జనవరి వరకు నిరంతరం వెలుగుతూ ఉంటుంది. అప్పటి వరకు ప్రతీరోజూ భక్తులు కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేసి మొక్కులు తీర్చుకుంటారు. కర్పూర జ్యోతి అనంతరం ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించారు. స్వామి ప్రభను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, గజేశ్వరరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


గుసుపూడి సోమేశ్వరాలయంలో వేదాశీర్వచనం తీసుకుంటున్న ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీమోహన్

పంచారామాల్లో వాణీమోహన్ పూజలు

భీమవరం టౌన్/పాలకొల్లు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని పంచారామ క్షేత్రాలైన గునుపూడిలోని సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరుడిని జనరల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణిమోహన్ శుక్రవారం దర్శించుకుని పూజలు చేశారు. గునుపూడి ఆలయంలో ఆమెకు ఆలమ ఈవో రామకృష్ణంరాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకుడు చెరుకూరి రామకృష్ణ పూజలు చేసి ఆశీర్వచనాలు అందించారు. పార్వతీ దేవి, అన్నపూర్ణాదేవి, జనార్ధనస్వామివారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. పాలకొల్లు ఆలయంలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి శేష వస్త్రాన్ని, చిత్రపటాన్ని ఈవో శ్రీనివాసరావు అందించారు పండితులు వేదాశ్వీరచనం ఇచ్చారు.

కైకరంలో షష్టి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


షష్టి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే ధర్మరాజు

ఉంగుటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన కైకరం శ్రీవల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో షష్టి ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శుక్రవారం ఆవిష్కరించారు. ఆలయ కమిటీ తరఫున జడ్పీటీసీ మాజీ సభ్యుడు సలగాల గోపి, చింతల శ్రీనివాస్, పామర్తి సత్తిబాబు, చిప్పాడరాజు, గురువెల్లి నాగేశ్వరరావు, యెగ్గిన హేమ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ ప్రారంభిస్తున్న రామదండు సభ్యులు మొటపర్తి రాజా బాబు

మోటారు సైకిళ్లపై 6 శివాలయాల దర్శనం

దెందులూరు,నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వందలాది మంది భక్తులు మోటారు సైకిళ్లపై ర్యాలీగా వెళ్లి 6 పురాతన శివాలయాల్లో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. హిందూ సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో భాగంగా స్థానిక హిందూ పరిరక్షణ సమితి, రామదండు సంయుక్తంగా ఈ కార్యక్రమం చేపట్టారు. హిందూ మతం అంటే ధర్మానికి, న్యాయానికి కట్టుబడడమేనని హిందూ పరిరక్షణ, రామదండు సభ్యులు మోటపర్తి రాజా, సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దెందులూరులోని అతి పురాతన శివాలయంలో శుక్రవారం వందలాది మంది భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఒకేసారి 6 పురాతన శివాలయాల దర్శనానికి రామదండు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీని సుగ్గిశెట్టి నూకరాజు, మోటపర్తి రాజాబాబు ప్రారంభించారు. హిందూ ధర్మాన్ని రక్షించేందుకు ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. దెందులూరు, చల్లచింతలపూడి శ్రీమేధా దక్షిణమూర్తి ఆలయంల జోగన్నపాలెం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామవరం పంగిడిగూడెం ద్వారకాతిరుమల శివ క్షేత్రాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో బైక్‌పై ర్యాలీ నిర్వహించి హిందూ ధర్మం వర్ధిలాలని నినాదాలు చేశారు, రామదండు సభ్యులు, అయ్యప్ప మాలధారులు, రాజేష్ తులసీదాస్, తదితరులు పాల్గొన్నారు


గునుపూడి సోమేశ్వరుడికి అభిషేకం, ఆచంట, పట్టిసీమలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ


ఏలూరులో స్పటిక లింగం


పెనుగొండ, ఏలూరు పత్తేబాద, పాలకొల్లు పంచారామాల్లో స్వామి వారికి అలంకరణ

కార్తీక దీపం


ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయం వద్ద జ్వాలాతోరణం


భీమవరం కనకదుర్గ ఆలయం వద్ద కార్తీక దీపోత్సవం

• శివాలయాల్లో పౌర్ణమి శోభ • దీపాల వెలుగు • ప్రత్యేక పూజలు • వైభవంగా జ్వాలా తోరణం




శైవ క్షేత్రాలు కార్తీక పౌర్ణమి వెలుగులు, దీప కాంతులతో ఆధ్యాత్మిక శోభను వెదజల్లాయి. భక్తుల శివ నామస్మరణతో మార్మోగాయి. పున్నమి చంద్రుడు కాంతులీను వేళ మహిళలు దీపారాధనతో స్వామి వారికి పూజలు చేశారు. ధ్వజ స్తంభాలు, ఆలయ ఆవరణలో ఉసిరి చెట్ల వద్ద దీపాలు వెలిగించారు. పలువురు మహిళలు 365 నేతి ఒత్తులు వెలిగించి పూజల అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల వద్ద జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. భక్తుల దీపారాధన ముగుస్తుండగా శివాలయాల వద్ద జ్వాలా తోరణం వెలిగించడంతో స్వామి, అమ్మవార్లు జ్వాలల కింది నుంచి ముమ్మారు తిరిగి భక్తులను కరుణించారు. అదే సమయంలో భక్తుల శివనామ స్మరణ మిన్నంటింది. భక్తిభావంతో స్వామి వారికి మొక్కుకున్నారు. జ్వాలా తోరణం ఆరిన తర్వాత కాలిన గడ్డిపరకలు భక్తులు తీసుకెళ్లారు. అనంతరం స్వామి అమ్మవార్లు బాజాభజంత్రీల నడుమ పుర వీధుల్లో ఊరేగారు.





ఏలూరు అవిముక్తేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన


పెనుగొండ మండలం సిద్ధాంతంలో గోదావరి హారతి


ఏలూరు చౌడేశ్వరి రామలింగేశ్వరాలయంలో దీపారాధన


ఏలూరు రామకోటి వద్ద శివాలయంలో పూజలు


గునుపూడి సోమేశ్వరాలయంలో భక్తుల రద్దీ


సిద్ధాంతం కేదారేశ్వర స్వామి ఆలయంలో శివలింగానికి భక్తుల పూజలు


ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల పూజలు

గురుకుల పాఠశాల విద్యార్థుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు


పోలసానపల్లి గురుకుల పాఠశాల ఆవరణలో కబడ్డీలో తలపడుతున్న క్రీడాకారులు

భీమడోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలసానపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో జరుగుతున్న జోనల్ స్పోర్ట్స్‌మీట్ శుక్రవారం రెండోరోజుకు చేరుకున్నాయి. మొదటి రోజు రెండవ రోజు నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేతలను శుక్రవారం ప్రకటించారు. సర్కిల్ విభాగంలో 1500 మీటర్ల పరుగు పందెంలో జంగారెడ్డిగూడానికి చెందిన వి.ఇందు, పోలసానపల్లి గురుకుల పాఠశాలకు చెందిన నిత్యశ్రీ, జంగారెడ్డిగూడానికి చెందిన పూజ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. షార్ట్‌పుట్ విభాగంలో ముత్తళ్ళకు చెందిన పి.కీర్తన, కొవ్వూరుకు చెందిన పి.కృష్ణవేణి, వి.శ్రీలత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. కాలేజీ విభాగం షార్ట్‌పుట్‌లో తునికి చెందిన లావణ్య, ముత్తళ్ళకు చెందిన లిఖిత, కె.రమ్య ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. డిస్కస్ త్రోలో తునికి చెందిన లావణ్య, పుట్టముక్కలకు చెందిన కె.నిధి, ముత్తళ్ళకు చెందిన వి.నిఖిత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మిగిలిన విభాగాల్లోని కబడ్డీ, ఖోఖో, హ్యాండ్‌బాల్, చెస్ పోటీల్లో తొలి రౌండ్ ముగిసి ఫైనల్స్ జరగాల్సి ఉంది. పీఈటీలు, క్రీడా విభాగం అధికారులు పోటీలను పర్యవేక్షిస్తున్నారు.



దిష్టి రాళ్లకు చెక్!

• సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లు తొలగింపు • కొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభం

ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేలో పాతిన హద్దు రాళ్లు దిష్టిబొమ్మలుగా పడి ఉన్నాయి. వాటిపై జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపి వేయాలని రెవెన్యూశాఖకు సూచించింది. వారం, పదిరోజుల్లో సరిహద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. శ్యాండ్‌వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తోంది. ఒకవేళ ఖర్చుతో కూడుకున్నట్లయితే మాన్యువల్‌గా చేసేవారికి పనిని అప్పగించాలని యోచిస్తోంది. భూముల రీసర్వే కార్యక్రమానికి గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేసి ఆ తరువాత గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. సాధారణంగా ఏదైనా భూములు సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎటువంటి పేర్లు, బొమ్మలు వేయదు. టైటిల్ డీడ్‌పైనే భూహక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అటువంటిది వైసీపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫొటోలను ముద్రించి మరోవైపు భూముల హద్దు రాళ్లపై జగన్ ఫొటోలు, పేర్లు, వైసీపీ రంగులు అద్దింది. దీనిని పలువురు భూ యజమానులు అభ్యంతర పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్‌డీడ్, హద్దురాళ్లపై ఫొటోలతో అవి జగన్‌కు చెందిన ఆస్తులుగా ఉన్నట్లు చిత్రీకరణ జరిగింది. ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లింది. మీ ఆస్తులపై జగన్ ఫొటోలు, పేర్లు ఏంటి మళ్లీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా, తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని హెచ్చరించాయి. దీంతో ప్రజల్లో తమ భూములు లాక్కుంటారన్న భయం ఏర్పడింది. ఏలూరు జిల్లాలో పలు మండలాల్లో సుమారు 70 వేలకు పైగా హద్దురాళ్లను పాతినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వాటిని తొలగించేందుకు ఒక్కో రాయికి రూ.15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తారు. అనంతరం హద్దురాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.


పున్నమి రాత్రి



పున్నమి వేళ రెండు పొడపాములు సయ్యాటలాడుతూ చూపరులను అబ్బురపరిచాయి. సాధారణంగా త్రాచు, జెర్రిగొడ్డు మనకలాడటం చూస్తుంటాం. శుక్రవారం శివాలయం సమీపంలో రెండు భారీ పొడపాములు దాదాపు గంట సేపు పెనవేసుకుని కన్పించాయి. పౌర్ణమి పర్వదినం కావడంతో తెల్లవారు జామున శివదేవుని ఆలయానికి వచ్చిన భక్తులకు ఈ దృశ్యం కంటపడింది.

- ద్వారకాతిరుమల

నరికేసినా మొలుస్తా..


అరటి మోడుకు మొలిచిన గెల

నరికేసినా మొలుస్తా అంటూ.. అరటి మోడు గెలతో సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. పోలవరం బాపూజీ కాలనీలో పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బోడపాటి ఎలీషా ఇంటి ఆవరణలో అరటి చెట్టు గెల కోసి మొదలంటూ నరికేశాడు. కొన్ని రోజులకు మోడుకు గెలతో పూత రావడంతో స్థానికులు వింతగా చూశారు.

- పోలవరం

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1 నుంచి దీక్షలు
సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ



పెనుమాకలంకలో ప్రసంగిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మండవల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కొల్లేరు పరిరక్షణలో భాగంగా శుక్రవారం పెనుమాకలంక గ్రామాన్ని సందర్శించారు. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కొల్లేరులో కలిసే ప్రాంతాన్ని బోటుపై నారాయణ పరిశీలించారు. అనంతరం పెనుమాకలంక గ్రామ కూడలిలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కొల్లేరు లంక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కొల్లేరు మాఫియా కబంధ హస్తాలలో కొట్టుమిట్టాడుతుందని ధ్వజమెత్తారు. వందల ఎకరాలలో నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా చేపల చెరువులు తవ్వి, సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేశారని మండిపడ్డారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు కాలువలు పూడుకుపోయి నీటి పారుదల సౌకర్యం లేక వరదలు వచ్చినప్పుడు లంక గ్రామాలు నీట మునిగి ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన లంక గ్రామాలలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఫిబ్రవరి 1నుంచి దీక్షలకు సిద్ధమని నారాయణ ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమి షన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, వరకా శ్యామల, సీపీఐ ఏలూరు కార్యదర్శి హేమశంకర్ పాల్గొన్నారు.

జగన్ రాజీనామా చేయాలి

ఏలూరు కార్పొరేషన్: జగన్ అసెంబ్లీకి రాకుండా ఉండడం ప్రజలను వ్యతిరేకించడమేనని, అసెంబ్లీకైనా రావాలి లేదా ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఏలూరులో సీపీఐ భవనం వద్ద జరిగిన సభకు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కొల్లేరు సరస్సును ఐదవ కాంటూరు వరకు కొనసాగించాల్సిందేనన్నారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు పూడిక పనులు చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజా సమస్యలను ఎందుకు పరిష్కరించడంలేదంటూ ప్రశ్నించారు. 2006లోనే సుప్రీంకోర్టు కొల్లేరు పరిరక్షణకై తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. కొల్లేరు ప్రాంతాల్లోని ప్రజలు కొల్లేరులో చేపలు పట్టుకుని అమ్ముకోవాలంటే రోడ్డు మార్గం కూడాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.



సీసలి గ్రామంలో చేపల చెరువుల పరిశీలనకు విచ్చేసిన ఒడిస్సా బృందం

ఒడిస్సా బృందం చేపల చెరువుల పరిశీలన

కాళ్ళ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒడిస్సా రాష్ట్ర మత్స్యశాఖ బృందం కాళ్ళ మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పర్యటన చేశారు. మత్స్యశాఖలో అత్యధిక దిగుబడి సాధిస్తున్న దృష్ట్యా రైతులు పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సీసలి గ్రామంలో చేపలు, రొయ్యల చెరువుల సాగుతో పాటు కాళ్ళ గ్రామంలో హ్యాచరీలను పరిశీలించారు. తమ రాష్ట్రంలోని మత్స్య సంపదను మరింత మెరుగుపరుచుకోవడం కోసం క్షేత్ర పర్యటకు రావడం జరిగిందన్నారు. సీసలి, చినకాపవరం మత్స్యశాఖ సహాయకులు సత్యనారాయణ, అహ్మద్ హుస్సేన్‌లు ఒడిస్సా బృందానికి సహకరించారు.



ఏపీనిట్‌లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తాడేపల్లిగూడెం అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ధైర్యంగా ముందుకు సాగాలని ఆక్టోపస్ డీఎస్పీ జగ్గి నాయుడు అన్నారు. పట్టణంలోని ఏపీనిట్ ప్రాంగణంలో ఆక్టోపస్ డీఎస్పీ జగ్గి నాయుడు, ఆర్‌ఐలు బీ.జయప్రకాష్, కె.వర ప్రసాద్, ఎ.రామ్మోహన్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్కర పరిస్థితులు వాటిని ఏవిధంగా ఎ దుర్కోవాలి అనే దానిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐలు నాగరాజు, శ్రీను, ఏపీనిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి, ఈఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలి

శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి



ఇరగవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తణుకులో ఈ ఎస్‌ఐ ఆసుపత్రి నిర్మించాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. అసెంబ్లీ సమావేశా లలో ప్రశ్నోత్తరాల సమయం లో ఎమ్మెల్యే మాట్లాడారు. తణుకు పరిసర ప్రాంతాల్లో 60 వేల మంది కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని కార్మిక శాఖ మం త్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ఈఎస్‌ఐ బీమా కలిగి ఉన్న సభ్యులు చికిత్స కోసం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న రాజమండ్రి ఈఎస్‌ఐ ఆసుపత్రికి వెళ్ళవలసి వస్తుందని 2014-19 మధ్యలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయడం జరిగిందన్నారు. దీనికి తాము 1.14 ఎకరాల భూమి కేటాయించామని తరువాత 2019లో వైసీపీ ప్రభుత్వం రాగానే నిర్మాణాన్ని గాలికి వదిలేశారని సభకు తెలియ జేశారు. ప్రస్తుతం తణుకులో ఉన్న ఈఎస్‌ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో ఉందనీ, సిబ్బంది, సౌకర్యాల కొరత ఉందని మంత్రి దృష్టికి తీసుకు వెళ్ళారు. శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సమర్థిస్తూ తణుకుకు ఈఎస్‌ఐ ఆసుపత్రి మంజూరు చేయడానికి 100 శాతం కృషి చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు.




ఖాతాల అనుసంధానానికి 30 వరకు గడువు

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా జమచేసేందుకు అవసరమైన ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కి అనుసంధానం తప్పనిసరి అని ఏపీ పోస్టల్ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.శివనాగరాజు తెలిపారు. శుక్రవారం ఇశ్రాయేల్‌పేట శివగోపాలపురం సచివాలయం, ప్రగడవరం పోస్టాఫీసుల్లో స్పెషల్ క్యాంపులను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలో దాదాపు 64.81లక్షల ఖాతాలకు ఎన్‌పీసీఐతో ఇంకా లింక్ కాకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయని, వీటిని పునరుద్ధరించడం ద్వారా ఎన్‌పీసీఐకి అనుసంధానం చేసేందుకు పోస్టాఫీసుల్లో నిర్వహిస్తోన్న ప్రత్యేక క్యాంపులు ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతాయని వివరించారు. ఏలూరు డివిజన్ పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర బాబు, ఐపీపీబీ రీజనల్ మేనేజర్ సుబ్బారావు, ఏలూరు డివిజన్ సీనియర్ మేనేజర్ రాజేష్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నారికేళం... ధర ఘనం!

- కార్తీకంలో కొబ్బరికి డిమాండ్
- వెయ్యి కాయలు రూ.13వేల నుంచి 18 వేలు
- పండుగల వేళ పెరిగిన వినియోగం
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గరిష్ట ధర
- పశ్చిమలోనూ రైతువారీ కొనుగోళ్లు ముమ్మరం



పాలకొల్లు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కొబ్బరి మార్కెట్‌కి కార్తీక శోభ వచ్చింది. ఒక వైపు రైతువారీ కొనుగోళ్ల ధర ఆశాజనకంగా ఉండగా మరో వైపు రిటైల్ మార్కెట్‌లో కొబ్బరి ధర దడ పుటిస్తున్నది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో రైతువారీ కొనుగోళ్ల ధర గరిష్ఠంగా వెయ్యి కాయలు రూ.13వేలు ఉండగా పాత తూర్పుగోదావరి జిల్లాలో కొబ్బరి రైతువారీ కొనుగోలు ధర వెయ్యి కాయలకి రూ. 16 నుంచి 18వేలు ధర పలుకుతున్నది. కార్తీక మాసం కావడంతో స్థానికంగానూ కొబ్బరికి డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు కాయ తయారు కాకుండానే దింపు తీస్తున్నారు. కొబ్బరి చెట్లను దింపిన వెంటనే ఎగుమతులు చేసుకోవడంతో కాయ నిలువ ఆగనప్పటికీ నష్టం లేదని వర్తకులు చెబుతున్నారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాలో అధిక శాతం నీటికాయ (బొండాలు) తీసివేయడంతో తయారీ కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సమీప రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటకలలో దిగుబడి తగ్గడంతో ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. దశమికి ముందు రైతువారీ కొనుగోళ్లలో కొబ్బరి ధర గరిష్ఠంగా రూ.18వేలుకు చేరగా ఇప్పుడు మరోసారి రైతువారీ కొనుగోళ్ల ఊపందుకున్నాయి. పశ్చిమలో ధరలు తక్కువ ఉన్నప్పటికీ తూర్పుగోదావరి జిల్లాలో నాణ్యతను బట్టి కొబ్బరి అధిక ధరలకు కొనుగోళ్లు చేస్తున్నారు. పాత కాయ 28సైజు రిటైల్ మార్కెట్‌లో రూ.25 నుంచి 30కి అమ్ముతున్నారు. ఈధరలు కార్తీక మాసాంతం వరకూ స్థిరంగా ఉంటాయని కొబ్బరి మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. ఢిల్లీ క్వాలిటీ (గండేరా) పాత కాయలు డిమాండ్ పెరిగింది. పశ్చిమ రాష్ట్రాలలో డిమాండ్ ఉండే నెంబరు(చిన్నవి) కాయలుకు డిమాండ్ పెరిగింది. 70 బత్తీలు 80బత్తీలు సైజు కాయలు దిగుమతులకు వర్తకులు సిద్ధం చేశారు. తెలంగాణా రాష్ట్రంలోనూ, రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోనూ కార్తీక మాసం సందర్భంగా కొబ్బరి వినియోగం ఘణనీయంగా పెరిగింది. కార్తీక మాసం అనంతరం క్రిస్మస్, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని వినియోగం పెరుగుతు న్నదున కొబ్బరి మార్కెట్‌కి మరింత ఊతం రావచ్చని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. మొత్తంగా కొబ్బరి రైతులకు పెరిగిన ధర ఊరటనిచ్చింది.

'పది' ఉత్తీర్ణులకు తొలగిన అడ్డంకి

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్కూలు యాజమాన్యంలో అంతర్గత కుమ్ములాటలవల్ల పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు జూనియర్ ఇంటర్‌లో ఇబ్బందులు పాలవుతున్న ఉదంతంపై జిల్లావిద్యాశాఖ దృష్టిసారించింది. కామవరపుకోట మండలంలోని ఓ అన్‌ఎయిడెడ్ ప్రైవేటు స్కూలు యాజమాన్యం రెండుగా విడిపోయింది. ఫలితంగా స్కూలు నిర్వహణ, విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచ రంగా తయారైంది. ఈ నేపథ్యంలో గత విద్యాసంవత్సరం (2023-24)లో పదోతరగతి పరీక్షలకు ప్రిపేర్ అయిన విద్యార్థులను వివాదా స్పద స్కూలు నుంచి కాకుండా సమీపంలోని మరో ప్రైవేటు స్కూలు నుంచి పరీక్షలు రాయించేశారు. తదుపరి ఉత్తీర్ణులందరూ టెన్త్ షార్ట్ మార్కుల మెమోలతో ఈ ఏడాది జూనియర్ ఇంటర్‌లో చేరారు. ఇపుడు ఒరిజనల్ మార్కుల జాబితాలు వచ్చాయి. వీటిపై సంబంధిత స్కూలు హెచ్‌ఎం సంతకం చేసి విద్యార్థులకివ్వాల్సిఉంది. అయితే తమ స్కూలు రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాకుండా టెన్త్ పరీక్షలు రాసి ఉత్తీర్ణులైనంత మాత్రాన పాస్ సర్టిఫికెట్‌లపై సంతకం ఎలా చేస్తానని, ఒకవేళ అలాచేసినా సంబంధిత విద్యార్థులకే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని హెచ్‌ఎం హెచ్చరించడంతో సమస్య జటిలమైంది. ఇపుడు జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్షలకు ఫీజుచెల్లించాలంటే టెన్త్ క్లాస్ ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుంది. ఈలోగా అనధికారికంగా మూతపడిన స్కూలు యాజమాన్యానికి చెందిన ఒకరు గత సోమవారం డీఈవో కార్యాలయానికివచ్చి అధికారులు, సిబ్బందితో గొడవపడ్డారు. ఇక యాజమాన్యంలో నెలకొన్న అంతర్గత కుమ్ములాటల మధ్య విద్యార్థులు నష్టపోకూడదని విద్యాశాఖ ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో సంబంధిత విద్యార్థుల తరఫున తల్లితండ్రులనుంచే ఫిర్యాదు తీసుకుని కలెక్టర్ అనుమతితో టెన్త్ ఉత్తీర్ణులకు పాస్ సర్టిఫికెట్లు ఇవ్వాలని నిర్ణయించింది.

ఇక జిల్లా కేంద్రాల్లోనే టీచర్లకు శిక్షణ

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఇకమీదట సంబంధిత జిల్లాల కేంద్రాల్లోనే ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించేలా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ నిర్ణయం తీసుకున్నారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం విజయవాడలో అన్ని ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాలను ఇక్కడి పత్రికలకు తెలియజేశారు. శిక్షణ తరగతుల నిడివిని తగ్గించడంతోపాటు, క్లాసుకు,క్లాసుకుమధ్య పది నిమిషాల విరామం ఉండేలా నిర్ణయించారని వివరించారు. వైద్యపరంగా ఇబ్బందులున్నవారికి, తీవ్ర అనారోగ్య పరిస్థితులున్న వారికి శిక్షణ నుంచి మినహాయింపు ఇస్తారని, అలాగే సహేతుక కారణాలుచూపినవారికీ స్వీయఅభ్యర్ధనపై మినహాయింపు ఉంటుందన్నారు. ఆరోగ్యపరంగా ఇబ్బందులున్నవారు యోగా, కల్చరల్ యాక్టివిటీస్‌లో పాల్గొననవసంలేదన్నారు. కాగా ఈ నెల 18నుంచి నాయకత్వ లక్షణాలపై హెచ్‌ఎంలకు రెండోవిడత, ఎఫ్‌ఎల్‌ఎన్ పేరిట ఎస్జీటీలకు మూడోవిదత శిక్షణ తరగతులు ప్రారంభంకావాల్సిఉండగా, తాజా పరిణామాలనేపథ్యంలో తేదీలు, వేదికలు మారనున్నాయి. దీనిపై శుక్రవారంసాయంత్రంవరకు అధికారిక ప్రకటన లేదు.

19,20 తేదీల్లో ఆర్టీసీ కార్మికుల నిరసన

భీమవరం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలు పూర్తి అయినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాక ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్న నేపథ్యంలో ఈనెల 19, 20 తేదీల్లో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలుపుతున్నట్లు ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌పీవీ ప్రసాద్, కార్యదర్శి అల్లం సత్యనారాయణ తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చెయ్యాలని, పదోన్నతులు కల్పించాలని, ఉద్యోగులకు రావలసిన బకాయిలు చెల్లించాలని, త్వరలో పేస్కేలు జరిపి మెరుగైన వేతన సవరణ చెయ్యాలని పలు సమస్యలపై ఆందోళన చేపడతున్నామని తెలిపారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

పెదపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు కుళ్లిన చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పెదపాడు, పరిసర ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి ఐషర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. వాహనంలోని 10 వేల కిలోల చికెన్ వ్యర్థాలతో పాటుగా వాహనాన్ని స్వాధీనం చేసుకుని చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా ఎస్సై తెలిపారు. వాహన, చెరువు యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

క్రైమ్ కార్నర్

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

భీమవరం క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం కొవ్వాడ పుంతకు చెందిన నెల్ల వెంకటలక్ష్మి, చినరంగని పాలెంకు చెందిన బొచ్చ సుధ ఆర్టీసీ డీపో వెనుక ప్రాంతంలో ఒక నివాసంలో మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకులైన ఇద్దరు మహిళలతో పాటు, విటుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బాధిత మహిళను కూడా అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చామని వారి వద్ద నుంచి రూ.2వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారి పడి యువకుడి మృతి



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేగంగా వెళ్తున్న రైలునుంచి ఒక గుర్తు తెలియని యువకుడు జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి రైల్వే స్టేషన్ దాటిన తరువాత సుమారు 20 నుంచి 25 ఏళ్ళ వయస్సు కల్గిన యువకుడు రైలు పట్టాల పక్కన మృతి చెంది యున్నాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్‌ఐ పి సైమన్ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 5 అడుగుల ఎత్తు, ఛామనచాయ శరీరంతో ఉన్నాడు. తెలుపు రంగు చుక్కలతో కూడిన నీలం రంగు రెడీమేడ్ పొడవు చేతుల చొక్కా, నలుపు జీన్స్‌ప్యాంటు, సపోటా రంగు షార్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆరాలు లభించలేదు. అనుమానాస్పద మృతిగా నమోదు చేసి మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్‌ఐ పి సైమన్ సెల్ నెంబర్ 9989219559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.



తాటాకు ఇల్లు దగ్ధం

ఆచంట, నవంబరు15 (ఆంధ్రజ్యోతి): పెదమల్లం శివారు సిర్రావారి పేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో లంక ధనరాజుకు చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. ధనరాజు, అతని భార్య, కుమారుడు పనులకు వెళ్ళగా కుమార్తె కళాశాలకు వెళ్ళడంతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు వ్యాపించి ఇల్లు మొత్తం అగ్నికి ఆహుతి అయ్యింది. సమాచారం తెలుసుకున్న పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు 5 లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, ఆర్‌ఐ లక్ష్మి, వీఆర్‌వో శేషగిరి పరిశీలించి బాధితుడికి బియ్యం అందజేశారు.

సుప్రీంకోర్టు అధికారులమంటూ ఫోన్‌కాల్

కేసు నమోదైందని షూరిటీ బెయిల్‌కు సొమ్ము చెల్లించాలని డిమాండ్
రిటైర్డ్ ఉద్యోగి నుంచి 16 లక్షల 55 వేల రూపాయలు అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరుకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి తాము ఢిల్లీ నుంచి సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు నమోదైందని బెయిల్ పెట్టుకుని వెంటనే షూర్టీ తీసుకోకపోతే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు వస్తాయని భయభ్రాంతులకు గురి చేసి ఏకంగా 16 లక్షల 55 వేల రూపాయలను తమ అకౌంట్‌లో వేయించుకున్నారు. అంతేకాకుండా బెయిల్‌కోసం మరో ఐదు లక్షలు జమ చేయాలని బెదిరించడంతో అనుమానం కల్గిన ఆ ఉద్యోగి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని అక్కినేని రెసిడెన్స్‌లో నివాసం ఉంటున్న చెందిన కాకరపర్తి ఉదయశంకర్ న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీలో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయనకు ఒక గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ రావడంతో లిఫ్టు చేశారు. తాము సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు ఫైల్ అయిందని వెంటనే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు వస్తున్నాయని వారిని ఆపాలంటే వెంటనే షూరిటీ సొమ్ము చెల్లించాలని నాలుగు దఫాలుగా గత రెండు రోజుల నుంచి 16 లక్షల 55 వేల రూపాయలను వివిధ అకౌంట్లో వేయించుకున్నారు. అంతేకాకుండా బెయిల్ కోసం మరో 5 లక్షల రూపాయలు ఫీజు చెల్లించాలని భయభ్రాంతులకు గురిచేయడంతో తాను మోసపోయానని గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైపీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిచ్చి కుక్కస్వైర విహారం

ఇద్దరికి గాయాలు



కుక్క దాడిలో గాయపడిన వృద్ధుడు

నరసాపురం టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. 11వ వార్డు పార్కు రోడ్‌లో వెళుతున్న కనకం నాగేశ్వరరావు, ఎ.సూర్యనారాయణలను గాయపర్చింది. ఈ విషయం తెలుసుకుని పలువురు పరుగులు తీశారు. గాయపడిన ఇద్దరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరికి రేబిస్ ఇంజక్షన్ డోస్ ఇచ్చారు. పిచ్చి కుక్క కోసం స్థానికులు గాలిస్తున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలో ఇటీవల కుక్కల బెడద పెరిగింది. స్టీమర్‌రోడ్, పంజాసెంటర్, వైఎస్ఆర్‌కాలనీ, రైల్వేస్టేషన్ రహదారుల్లో చీకటి పడితే కుక్కల బెడద తప్పడం లేదు.

ఇద్దరు వ్యాపారులపై కేసు నమోదు



దుకాణం వద్ద తనిఖీలు చేస్తున్న అధికారులు

నరసాపురం రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బిచర్ల గ్రామంలో కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తున్న ఇద్దరు వ్యాపారులపై ఫుడ్ కంట్రోల్ అధికారులు కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని స్కూల్ పిల్లలకు కాలం చెల్లిన తినుబండారాలు విక్రయిస్తున్నట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారికి ఫిర్యాదులు అందాయన్నారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామంలోని రెండు కిరాణషాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. రెండు దుకాణాల్లో నిల్వ సరుకులు గుర్తించామన్నారు. వ్యాపారి వి వెంకట సురేష్, వి.రాజులపై కేసులు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ, వీఆర్వో సూర్యనారాయణ పాలొన్నారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్



ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒక హోటల్‌లో గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తున్నారని జిల్లా విజిలెన్సు ఎస్పీ వి.శ్రీరాంబాబుకు సమాచారం అందడంతో ఆయన ఆదేశాల మేరకు విజిలెన్సు ఎమ్మార్వో బి.కన్యాకుమారి, ద్వారకా తిరుమల సీఎస్‌డీటీ పి.కామేశ్వరరావు, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు కలిసి దాడి చేశారు. ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ గ్రామంలో ఛాయ్ బిస్కెట్ ఫుడ్‌జోన్ హోటల్‌ను తనిఖీ చేసి ఐదు గ్యాస్ సిలిండర్లను గుర్తించారు. రెస్టారెంట్ యజమాని భలే విశ్వేశ్వరరావుపై కేసు నమోదు చేశారు. గ్యాస్ సిలిండర్ల విలువ 13,856 రూపాయలు అని తెలిపారు.

విజిలెన్సు అధికారుల దాడులు

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజిలెన్సు ఎస్‌ఐ సీహెచ్ రంజిత్ కుమార్, రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ సుంకరవారి తోటలో శుక్రవారం సాయంత్రం నిఘా పెట్టారు. ఏలూరు రూరల్ మండలం పోణంగికి చెందిన పరిసే డేవిడ్‌రాజు తన ఆటోలో 600 కేజీల రేషన్‌బియ్యాన్ని వేసుకుని వస్తుండగా అతనిని ఆపి విచారించారు. ఏలూరు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి వాటిని కొనకళ్ళ సాయిమనోజ్ కుమార్‌కు అమ్మి కాకినాడకు తరలిస్తున్నట్లుగా తెలిపారు. బియ్యం విలువ రూ.24 వేలు కాగా ఆటో విలువ లక్ష రూపాయలు. బియ్యం, ఆటోను సీజ్‌చేసి డేవిడ్‌రాజు, మనోజ్ కుమార్, నిమ్మల పవన్‌కుమార్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరిపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు కూడా నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

యలమంచిలి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏనుగువానిలంక గ్రామానికి చెందిన మైనర్ బాలిక కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య శుక్రవారం తెలిపారు. బాలిక తన ఇంటివద్ద నుంచి గురువారం ఉదయం కళాశాలకు వెళ్లి ఎంతకూ తిరిగిరాకపోవడంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీకోసం గాలించినప్పటికీ, లభించకపోవడంతో ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



కారు బోల్తా

ద్వారకాతిరుమల, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శివారు వేపాలమ్మ ఆలయ సమీపంలో ఓ కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది. తిమ్మాపురానికి చెందిన ఓ మహిళ కారును డ్రైవ్ చేస్తూ ద్వారకాతిరుమల నుంచి కామవరపుకోట వైపుకు వెళ్తోంది. మార్గం మధ్యలో వేపాలమ్మ ఆలయ సమీపానికి వచ్చేసరికి కారునడుపుతూ ఫోన్ మాట్లాడుతున్న ఈమె వాహనాన్ని కంట్రోల్ చేయలేక రోడ్డుపక్కగా పడిపోయి ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఆ తరువాత కారు అదుపుతప్పి బోల్తా కొట్టగా ఆమెకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికుల సహాయంతో ఆమెను ద్వారకాతిరుమల పీహెచ్‌సీలో చేర్పారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

దెందులూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నవంబరు 16న దెందులూరు తహసీల్దార్ కార్యాలయ అవరణలో మహిళలు, బాలికలకు న్యాయ విజ్ఞానంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయసాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ తెలిపారు. సదస్సులో మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగహన కల్పిస్తామన్నారు.

కొత్త నోటిఫికేషన్ ప్రకారం పరిహారం చెల్లించాలి

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతులకు కొత్త నోటిఫికేషన్ ద్వారా పరిహారం చెల్లించాలని భూ నిర్వాసిత రైతుల సమావేశం డిమాండ్ చేసింది. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమా వేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ సమ క్షంలో నిర్వాసిత రైతుల సమస్యలపై చర్చలు జరిపి న్యాయమైన పరిహారం చెల్లిం చాలన్నారు. రైతులు ఎస్.వరలక్ష్మి, తెగడ వెంకన్న, ఎస్.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస రావు, వెంకటరమణ, రాంబాబు, అంజిబాబు పాల్గొన్నారు.

లైంగిక దాడులు అరికట్టాలి

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు పెరిగాయని, వాటిని అరికట్టాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.ఎన్.వి.డి.ప్రసాద్ అన్నారు. మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ నిత్యవసరాల ధరలపై పోరాటం చేస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల రైతులకు నష్టపరిహారం ఎకరాకు 40 లక్షలు ఇవ్వాలని, లేదా భూమికి భూమి ఇవ్వాలన్నారు. చింతలపూడిలో ఆర్టీసి బస్సు డిపో ఏర్పాటు చేయాలని, ఇక్కడి నుండి విజయవాడ, అమరావతికి బస్సు సౌకర్యం లేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్వాసిత రైతులకు ఉపాధి కల్పించాలన్నారు. అనంతరం చింతలపూడి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.



కొత్తపల్లికి కాపు నాయకుల అభినందన

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కాపు సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన కొత్తపల్లి సుబ్బారాయుడును చింతలపూడి ఏరియా కాపు నాయకులు కలిసి అభినందన తెలిపారు. కాపుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని, కాపుల్లోని పేద విద్యార్థులకు చదువులో సాయపడాలని విజ్ఞప్తి చేసినట్టు జిల్లా కాపు నాయకులు బొడ్డు వెంకటేశ్వర రావు, కొత్తపూడి శేషగిరిరావు తెలిపారు. కాపు నాయకులు పాల్గొన్నారు.

పోలవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పోలవరం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పోలవరంలో పోలవరం-1, 3 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం కూటమి నాయకులు ఆధ్వర్యంలో మండల వ్యవసాయాధికారి కె రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ఈ సీజనుకి సంబంధించి ధాన్యం అమ్ముకునే రైతులు వారికి నచ్చిన మిల్లుల్ని ఎన్నుకుని ధాన్యం విక్రయాలు జరపవచ్చునని తెలిపారు. హమాలీ చార్జీలు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు జనసేన నాయకులు గునపర్తి చిన్ని, కొణతాల ప్రసాద్, వారాడి సత్తిబాబు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



మత్తుతో చిత్తే: డీఎస్పీ

భీమడోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుకు దూరంగా ఉండాలని ఏలూరు డీఎస్పీ డి. శ్రావణ్‌కుమార్ హితవు పలికారు. మండలంలోని ఆగడాలలంకలో మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల వచ్చే ముప్పు, పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్య వివాహాలు ప్రోత్సహించవద్దన్నారు. మహిళల రక్షణకు డయల్ 112, 9550351100 సేవలను వినియోగించుకోవాలన్నారు. భీమడోలు సీఐ విల్సన్, ఎస్‌ఐ సుధాకర్ పాల్గొన్నారు.

పశుగణన పూర్తిచేయాలి

భీమడోలు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిర్దేశిత గడువులోగా గ్రామాల్లో పశుగణన పూర్తి చేయాలని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ జెడీ నెహ్రూబాబు పిలుపునిచ్చారు. భీమడోలు మండలంలోని పలు గ్రామాలను ఆయన సందర్శించి పశుగణన అమలు తీరును పరిశీలించారు. ఆయనతో పాటు వైద్యులు ఎం హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పై శిక్షణ

ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి):ఏలూరు ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో వెంకటాపురం గ్రామంలో శుక్రవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు ప్రకృతి వ్యవసాయం పంటల సాగు పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిపిఎమ్ బి.తాతారావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంప్రదాయ, వ్యవసాయ సాగువల్ల ప్రకృతికి, నేలకు కలిగే నష్టాలను వ్యవసాయ ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన రైతులను గుర్తించి ప్రోత్సహిస్తామని తాతారావు తెలిపారు.







ద్వారకాతిరుమల క్షేత్రపాలకుడు శివయ్యకు పూజలు.. ఏలూరులో కార్తీక దీపారాధనలు.. శివయ్యకు పూజలు.. గాలాయగూడెంలో దీపోత్సవం

ఆరనీకుమా ఈ దీపం..

భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధనలు.. శివయ్యకు పూజలు, అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో పంచాక్షరి మంత్రం మార్మోగింది. అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చనలు, దీప దానాలు, స్వయం పాక దానాలు, జ్వాలా తోరణాలు తదితర కార్యక్రమాలతో ఆలయాలు కిటకిటలాడాయి. కార్తీక దీపాలను వెలిగించారు. కార్తీక నోములు నోచారు. సత్యనారాయణపేట కాలువ గట్టు వద్ద గల గంగా పార్వతీ సమేత రేవు లింగేశ్వరస్వామి వారికి విభూతితో అభిషేకం నిర్వహించి అనంతరం జ్వాలాతోరణం కార్యక్రమాన్ని నిర్వహించారు. బావిశెట్టివారి పేటలో గల దుర్గాంబను విశేషంగా అలంక రించారు. పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. అంబికాదేవి, సౌభాగ్యలక్ష్మిదేవి అమ్మవారిలో ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.

ద్వారకాతిరుమల: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం భక్తులతో కిటకిట లాడింది. ఆలయాన్ని పుష్పమాలికలు, మామిడి తోరణాలతో సిబ్బంది నయనానందకరంగా అలంకరించారు. గర్భాలయంలో శివదేవుని లింగ స్వరూపానికి అర్చకులు అర్చన, అభిషేకాలు చేసి హారతులను ఇచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు ఆలయ ఆవరణలో ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.

చింతలపూడి: చింతలపూడిలోని వేగిలింగేశ్వర స్వామి ఆలయం తెల్లవారుజామునే 4.30 గంట లకే భక్తులకు దర్శనాలు కల్పించారు. మండలంలోని రేచర్ల, రాఘవాపురం, గురుభట్ల గూడెం, ప్రగడవరం గ్రామాల్లోని శివాలయాల్లో స్వామివారికి భక్తులు పూజలు చేశారు.

పెదపాడు: పెదపాడులోని శ్రీ గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవాలయం శుక్రవారం కిటకిటలాడింది.

పెదవేగి: పెదవేగిలోని పురాతన శివాలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు తిప్పాభట్ల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో స్వామికి ఉదయం ప్రత్యేక పంచామృత అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు.

ఉంగుటూరు: కైకరం పార్వతీ సమేత రామలింగేశ్వరాలయంలో భక్తులు కార్తీక పూజలు నిర్వహించారు. రాత్రి దీపారాధనలు చేశారు. అనంతరం జ్వాలా తోరణాన్ని వెలిగించారు.

ద్వారకాతిరుమల: శేషాచలంపై క్షేత్రపాలకుడిగా కొలువైన శివుని ఆలయంలో శుక్రవారం రాత్రి జ్వాలాతోరణం నేత్రపర్వంగా జరిగింది. తోరణం నుంచి వచ్చిన భస్మంకోసం భక్తులు బారులు తీరారు. రాత్రి గజవాహనంపై గంగా పార్వతీ సమేతంగా శివయ్య ఊరేగారు.



మద్ది ఆంజనేయునికి లక్ష తమలపాకుల పూజ

జంగారెడ్డిగూడెం: మద్ది ఆంజనేయస్వామి దేవస్థానంలో కార్తీకమాస మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం మద్ది ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఆలయ భూ దాత ఇందుకూరి శివాజీశ్రీనివాసరాజు దంపతులు స్వామివారికి పూజలు చేయగా ఆలయ ఈవో చందన వారికి స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

దెందులూరు: గాలాయగూడెం శ్రీ అచ్చమ్మ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో శివాలయం వద్ద మహిళలు, గ్రామస్తులు దీపాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు,

18న కోటి దీపోత్సవం

ఏలూరు కార్పొరేషన్: రామకోటి ప్రాంగణంలో అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో ఈనెల 18న కోటి దీపోత్సవం నిర్వహిస్తున్నట్టు అన్నదాన సమాజం అధ్యక్షుడు కొట్టు మధు వెంకట్రావు, సభ్యులు సామర్ల కిరణ్‌కుమార్, కొట్టు మనోజ్‌లు తెలిపారు.



కార్యకర్తల సంక్షేమ పార్టీగా టీడీపీ గుర్తింపు : ఎంపీ పుట్టా

నిడమర్రు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేసే పార్టీగా టీడీపీ గుర్తింపు పొందిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం నిడమర్రులో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశం లో గన్ని మాట్లాడుతూ జిల్లా లో సభ్యత్వ నమోదులో ఉంగుటూరు నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలిపి మన సత్తా చాటాలన్నారు. పార్టీ మండల అధ్యక్షులు ముత్యాల స్వామి తదితరులు పాల్గొన్నారు.

జీలకర్రగూడెం జమీందార్ సతీమణి సత్యవతమ్మ మృతి



కామవరపుకోట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం జమీందారు దివంగత శ్రీ రాజారాఘవ రాజు సుబ్బరాజు సతీమణి శ్రీ రాజారాఘవరాజు సత్యవతమ్మ(92) శుక్రవారం తన నివాస గృహంలో మృతి పొందారు. జమీందారు సుబ్బరాజు కామవరపు కోట సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. సత్యవతమ్మ మృతి పట్ల ఆమె కుటుంబీకులకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల ప్రజలతో పాటు అధికారులు, ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జమీందారు సుబ్బరాజు, సత్యవతమ్మకు ఏడుగురు కుమారులు, ఒక కుమార్తె, మనుమలు, మనుమరాళ్ళు ఉన్నారు. సత్యవతమ్మ పార్థివ దేహాన్ని పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శించి నివాళులర్పించారు. జీలకర్ర గూడెంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. కాగా శనివారం సత్యవతమ్మ అంత్య క్రియలు నిర్వహించనున్నట్టు ఆమె కుటుంబీకులు తెలిపారు.

టీచర్లపై కేసుల ఎత్తివేత ప్రకటనపై హర్షం

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పలు ఉద్యమాల సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వం ఉపాధ్యాయులపై మోపిన కేసులను ఎత్తివేస్తామని కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించడంపట్ల ఏపీటీఎఫ్-1938 జిల్లా నాయకులు కృష్ణ, రత్నంబాబు, మోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై త్వరలోనే అన్ని సంఘాలతో సమావేశం నిర్వహించడానికి అంగీకరించడం అభినందనీయమన్నారు వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి మెగా డీఎస్సీ నియామకాలను పూర్తిచేయడంతోపాటు, డీఎస్సీ అభ్యర్థుల వయోపరిమితిని పెంచతామని చెప్పడం నిరుద్యోగులకు ఊరటనిస్తోందన్నారు.

సైబర్ నేరాలపై క్విజ్

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా అన ర్థాలు, రహదారి ప్రమాదాల నివారణ, ఆన్‌లైన్ భద్రత, పోలీసుల సహకారం తదితర అంశాలపై శుక్రవారం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్‌స్కూలులో 'సైనిక్ ప్రోగ్రాం' పేరిట అవగాహన కార్యక్రమం, క్విజ్ పోటీలు జరిగాయి. విజేతలకు టీషర్టులను బహూకరించారు. సైబర్‌సెల్ ఎస్సై మధు వెంకటరాజా, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి జనసేనలోకి..

ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ 44వ డివిజన్ కార్పొరేటర్ పొలిమేర దాసు, మాజీ కౌన్సిలర్లు అద్దేపల్లి నారాయణరావు, అద్దేపల్లి కృష్ణకుమారితో పాటు మరో 300మంది నాయకులు, కార్యకర్తలు, యువకులు ఏలూరు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ రెడ్డి అప్పల నాయుడు సమక్షంలో జనసేనలో చేరారు. జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానిం చారు. కాగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆర్టీసీ ఛైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావును రెడ్డిఅప్పల నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు.



క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరికి కడియాల అభినందన

ఉంగుటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నామినేట్ అయిన జనసేన నియోజకవర్గ నాయకుడు పొత్తూరి కృష్ణంరాజును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ కలుసుకుని అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి: డీఎంహెచ్‌వో

లింగపాలెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శర్మిష్ఠ అన్నారు. ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన రికార్డులను, మందుల ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న క్యాన్సర్ సర్వేలో పాల్గొని గ్రామస్థులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆరోగ్య కేంద్ర ఆవరణలో మందుల నిల్వగది, పార్కింగ్ షెడ్‌ల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

దేశ ప్రగతిలో 'సహకార' పాత్ర ఎనలేనిది

సహకార అధికారి శ్రీనివాస్

ఏలూరు సిటీ, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రగతిలో సహకార సంఘాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఏ శ్రీనివాస్ అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆవరణలో శుక్రవారం జిల్లా సహకార అధికారి శ్రీనివాస్ సహకార పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ సహకార సంఘాలు లాభాపేక్ష లేకుండా ప్రజలకు మరింత సేవలం దిస్తున్నాయన్నారు. ఏలూరు జిల్లాలో డీసీఎంఎస్ ద్వారా రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను తక్కువ ధరలకే అందిస్తున్నారన్నారు. సహకార వారోత్సవాల ఇన్‌చార్జి ఆర్ శ్రీనివాసరావు, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ కృష్ణమోహన్ ప్రసంగించగా జిల్లా సహకార అధికారులు ఎం. నరసింహరాజు, డీసీఎంఎస్ సీనియర్ అసిస్టెంట్ సుధాకర్, ఏకెఎస్ మూర్తి, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ స్పీకర్ రఘురామకు చింతమనేని అభినందన

పెదవేగి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఉప సభాపతి కె.రఘురామకృష్ణ రాజును దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అభినందించారు. శుక్రవారం శాసన సభలో ఆయనను కలిసి, పుష్పగుచ్ఛం అం దించారు. శాసనసభకు మరింత వన్నె తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభాకర్‌తోపాటు కైకలూరు, ఉంగుటూరు ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు.

ఎక్సైజ్ దాడులు

జీలుగుమిల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కామయ్యపాలెం శివారు పొలాల్లో ఓ వ్యక్తి అక్రమంగా సారా తయారు చేసేందుకు నిల్వ ఉంచిన 700 లీటర్ల బెల్లం ఊటను జంగారెడ్డిగూడెం ఎక్సైజ్‌శాఖ అధికారులు ధ్వంసం చేశారు. సీఐ కె.శ్రీనుబాబు సిబ్బంది కలసి గురువారం దాడులు జరిపారు. అక్రమ మద్యం, నాటుసారా కల్గి ఉంటే కేసులు నమోదు చేయక తప్పదని ఎక్సైజ్ అధికారులు చెప్పారు.



మద్యం దుకాణం తొలగించాలి

జంగారెడ్డిగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాల సమీపంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని తొలగించాలని డిగ్రీ కళాశాల, హాస్టల్ విద్యార్థినిలు ఆందోళన చేపట్టారు. మద్యం దుకాణం సమీపంలోనే డిగ్రీ కళాశాల, హాస్టల్ ఉండటంతో విద్యార్థినిలు ఆ వైపుగా వెళుతుండటంతో మద్యం త్రాగేవారితో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పలువురు విద్యార్థినిలు ఆందోళన చెందుతున్నారు. దీని పై ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబును వివరణ కోరగా గత ఐదు సంవత్సరాల నుండి ప్రభుత్వ మద్యం దుకాణం అదే స్థలంలో నిర్వహిస్తున్నారని, నిబంధనల ప్రకారమే అక్కడ దుకాణం ఏర్పాటు చేసినట్లు తెలియచేశారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అభిమానుల మనస్సుల్లో ఎప్పటికీ సూపర్ స్టారే

ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): అభిమానుల మనస్సుల్లో ఎప్పటికి కృష్ణ సూపర్ స్టారే అని ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, సూపర్‌స్టార్ కృష్ణ వ్యక్తిగత మ్యాకప్ ఆర్టిస్ట్ చేబ్రోలు మాధవరావు అన్నారు. శుక్రవారం సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమాన సంఘాల ఆధ్వర్యంలో దొండపాడు లోని పరివర్తన్ బధిరుల పాఠశాలలో కృష్ణ ద్వితీయ వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కృష్ణ



వ్యక్తిగత, మేకప్ మ్యాన్ మాధవరావుకు సూపర్‌స్టార్ కృష్ణ విశిష్ట పురస్కారాన్ని అందచేశారు. విద్యార్థులకు ఒకరోజు భోజన సదుపాయం కల్పించి స్వయంగా వడ్డించారు. కృష్ణ స్నేహితుడు, అసిస్టెంట్ డైరెక్టర్ ఆలీ, అభిమాన సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు 'శ్లోకా' స్కూల్ విద్యార్థుల దాతృత్వం

కుక్కునూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు శ్లోకా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులు 3 క్వింటాళ్ల బియ్యం, 50 కేజీలు కందిపప్పు, 100 జతల బట్టలు, 20 ప్లేట్లు, 20 దుప్పట్లు, నోటుపుస్తకాలు సేకరించుట జంగారెడ్డిగూడెంకు చెందిన అమ్మప్రేమ స్వచ్ఛంద సంస్థకు విరాళంగా అందించారు. ఎంపీడీఓ నరసింహారావు, తహసీ



ల్దార్ రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న మాలలు

మాలల మహాగర్జన విజయవంతం చేయాలి

చింతలపూడి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలలు డిసెంబరు 15న అమరావతిలో చేపడుతున్న మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ ఛైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 70 లక్షల మంది మాలలు ఉంటే 30 లక్షలు కూడా లేని మాదిగల కోరికలు తీర్చడానికి ప్రయత్నించడం అన్యాయమన్నారు. వర్గీకరణకు చేసే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. మాల సంఘా లన్నీ ఐక్యం గా ఐఎసిగా ఏర్పడి ప్రభుత్వ వైఖరికి నిరసన తెలియచేయడానికే అమరావతిలో డిసెంబరు 15న మాలల మహాగర్జన చేపట్టామ న్నారు. గౌరవ సలహాదారుడు ఎం.సంతోష్ కుమార్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

జంగారెడ్డిగూడెం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడు పి.సన్యాసిరావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఇంగ్లీష్ సాహిత్యంలో పీహెచ్‌డీ పొందారు. శుక్రవారం ఆయనకు కళాశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు, సిబ్బంది ఆయనను అభినందించారు.

అధికారులంతా 'వేదిక'కు అనుసంధానం కావాలి: కలెక్టర్

ఏలూరు అర్బన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం ఉదయం పదిగంటలనుంచి నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కారవేదిక (గ్రీవెన్స్ డే)పై కలెక్టర్ వెట్రిసెల్వి శుక్రవారం జారీచేసిన ఉత్తర్వుల్లో స్పష్టతనిచ్చారు. గ్రీవెన్స్ డే వేదికకు జిల్లాస్థాయి అధికారులంతా తప్పని సరిగా హాజరుకావాలని, ఏదైనా కారణంతో హాజరు కాలేకపోతే ముందస్తు అనుమతి తీసుకోవాలని ఆదే శించారు. అలాగే జిల్లాలోని రెవెన్యూ డివిజన్ స్థాయి అధికారులందరూ సంబంధిత ఆర్డీవో కార్యాలయంలో, మండల స్థాయి అధికారులు ఆయా తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమ వారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికకు హాజరుకావడంతోపాటు, వీడియో కాన్ఫ రెన్స్ ద్వారా కలెక్టరేట్‌లో నిర్వహించే గ్రీవెన్స్ డే వేదికకు అనుసంధానమై ఉండాలని స్పష్టం చేశారు. అధికారులంతా పూర్తిసమాచారంతో హాజరుకావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముందస్తు ప్రణాళికలతోనే గ్రామాల అభివృద్ధి

పెదపాడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి ముందస్తు ప్రణాళికలు ఎంతగానో దోహదం చేస్తాయని ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి అనురాధ తెలిపారు. పెదపాడు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో అభివృద్ధి ప్రణాళికల శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గ్రామ, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పరిష్కా రానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాల న్నారు. ఎంపీడీవో అమీలు జమ, ఇంచార్జి డీఎల్పీవో సూర్య కుమార్, ఏవో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి

టి.నరసాపురం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసైన్డ్, సీలింగు, ఇరిగేషన్ భూములు పేదలకు పంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఎఎస్ఆర్ నగర్‌లో మెట్ట పై అనుమోలు మురళీ, మడకం సుధారాణి, సరియం దుర్గమ్మ అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ.రవి మాట్లాడుతూ మండలంలో పేదల సాగు చేసుకున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 25 ఏళ్ళకు పైగా ఈ ప్రాంతంలో గిరిజనులు, దళితులు, పేదలు, భూములు కోసం పోరాడుతున్నారని అయినా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండి పడ్డారు. ఎర్రకాలువ ఇరిగేషన్ భూముల్లో సాగు చేసుకుంటున్నా వారికి ఏక్ సాల్ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయానికి విరాళం

ఉంగుటూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉప్పాకపాడు నాగలింగ సాయి షిర్డిసాయి బాబాకు కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దంపతులు బొమ్మిడి ప్రసాద్, నాగలక్ష్మి, అల్లు శ్రీను నాగమణి దంపతులు వేరు వేరుగా 25 లీటర్ల రైస్ హాట్ బాక్స్‌ను, 2.5కిలోల రైస్ కరెంటు కుక్కర్‌ను ఆలయ నిర్వాహకులు దూలం వెంకన్న బాబుకి అందజేశారు.



ఏలూరులో పుస్తక ప్రదర్శన

గ్రంథ పఠనంతో విజ్ఞానం పెంపు

గ్రంథాలయ వారోత్సవాల్లో వక్తలు

పెదవేగి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలకు రావడాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని పెదవేగి సీఐ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం పెదవేగిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయానికి రావడాన్ని ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. కుంటే గ్రంథపఠనంపై ఆసక్తి పెరుగుతుందని, తద్వారా ప్రజలు మరింత విజ్ఞానాన్ని అందిపుచ్చుకునే వీలుంటుందని ఆయన తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణతో ప్రజల్లో గ్రంథాలయాలపట్ల ఆసక్తి పెరుగుతుందనే నమ్మకాన్ని ఆయన వ్యక్తంచేశారు. విద్యార్థి దశనుంచే గ్రంథపఠనం చేస్తే ఆ విద్యార్థి గొప్ప విజ్ఞానవంతుడవుతాడని ఆయన వివరించారు. పెదవేగి ఎస్‌ఐ కె.రామకృష్ణ మాట్లాడుతూ సెల్‌ఫోన్‌కు ఎంత దూరంగా ఉంటే అంత ఆరోగ్యమన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ఏలూరు టూ టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మత్తుపదార్థాలకు దూ రంగా ఉండాలని గ్రంథపాలకురాలు యాగంటి శ్రీదేవి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. పుస్తకాలు, చదవటం వలన ఎంత విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చో ఆమె విద్యార్థులకు వివరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హిమాచలేశ్వరి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు విద్యార్థులకు నేర్పించారు. డ్రగ్స్ దుష్ప్రభావాల పై ఏఎస్పీ నక్కా సూర్యచంద్రరావు విద్యార్థులకు వివరించారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ గోపాల్, డిప్యూటీ లైబ్రేరియన్ నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ సందీప్‌కుమార్, పాల్గొన్నారు.

ఉంగుటూరు: 57వ జాతీయ గ్రంథాలయ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం నాడు పుస్తక ప్రదర్శన నిర్వహించారు. వెటర్నరీ వైద్యురాలు డా.శిరీష విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. గ్రంథ పాలకుడు చిట్టూరి గంగాధరం, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పెదపాడు: మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులతో పాటుగా ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు రాజకీయ, వర్తమాన, శాస్త్ర, సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దుగ్గిపోగు జాన్‌బాబు, పెద్దసంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని మండల విద్యాశాఖ అధికారిణి ఎస్.కల్యాణి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు గ్రంథాలయ పాలకులు ఆర్.కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను శుక్రవారం కల్యాణి ప్రారంభించి మాట్లాడుతూ అబ్దుల్‌కలాం వంటి ఎందరో మహనీయులు పుస్తక పఠనం ద్వారానే గొప్పవారు కాగలిగారని విద్యార్థులకు వివరించారు.

ఆచంటేశ్వర క్షేత్రంలో అఖండజ్యోతి


అఖండ జ్యోతికి ఆవు నెయ్యి సమర్పిస్తున్న భక్తులు

ఆచంట, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ ఆచంట ఉమా రామేశ్వరస్వామి ఆలయంలో వేలాది మంది భక్తుల శివనామ స్మరణ మధ్య శుక్రవారం సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) ప్రజ్వలన జరిగింది. ముందుగా గంధర్వ మహల్‌కు చెందిన గొడవర్తి వంశీయులు కృత్తికా నక్షత్ర హోమం, మండపారాధన, మహా నైవేద్యం, ధూపసేన నిర్వహించి అనంతరం కర్పూర జ్యోతిని వెలిగించారు. కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేయడానికి భక్తులు పోటీ పడ్డారు. సుమారు పది వేల మంది భక్తులు కర్పూర జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులు వెలిగించిన అఖండ జ్యోతి జనవరి వరకు నిరంతరం వెలుగుతూ ఉంటుంది. అప్పటి వరకు ప్రతీ రోజూ భక్తులు కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేసి మొక్కులు తీర్చుకుంటారు. కర్పూర జ్యోతి అనంతరం ఆలయం వద్ద జ్వాలా తోరణం వెలిగించారు. స్వామి ప్రభను గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఆలయ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ, గణేశ్వరరావు, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదే

సమస్యలు పరిష్కరించకుంటే ఫిబ్రవరి 1 నుంచి దీక్షలు

సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ


కొల్లేరులో పడవపై ప్రయాణిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

మండవల్లి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు పాపం ప్రభుత్వాలదేనని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. కొల్లేరు పరిరక్షణలో భాగంగా శుక్రవారం పెనుమాకలంక గ్రామాన్ని సందర్శించారు. బుడమేరు, తమ్మిలేరు, రామిలేరు ప్రవాహాలు కొల్లేరులో కలిసే ప్రాంతాన్ని బోటుపై నారాయణ పరిశీలించారు. అనంతరం పెనుమాకలంక గ్రామ కూడలిలో గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కొల్లేరు లంక ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కొల్లేరు మాఫియా కబంధ హస్తాలలో కొట్టుమిట్టాడుతుందని ధ్వజమెత్తారు. వందల ఎకరాలలో నిబంధనలు విరుద్ధంగా అక్రమంగా చేపల చెరువులు తవ్వి, సహజ సిద్ధమైన కొల్లేరును నాశనం చేశారని మండి పడ్డారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు కాలువలు పూడుకుపోయి నీటి పారుదల సౌకర్యం లేక వరదలు వచ్చినప్పుడు లంక గ్రామాలు నీట మునిగి ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతిపదికన లంక గ్రామాలలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. కొల్లేరు సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఫిబ్రవరి 1నుంచి దీక్షలకు సిద్ధమని నారా యణ ప్రభుత్వానికి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డేగా ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమి షన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, సీపీఐ ఏలూరు కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ పాల్గొన్నారు.

జగన్ రాజీనామా చేయాలి

ఏలూరు కార్పొరేషన్: జగన్ అసెంబ్లీకి రాకుండా ఉండడం ప్రజలను వ్యతిరేకించడమేనని, అసెంబ్లీకైనా రావాలి లేదా ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఏలూరులో సీపీఐ భవనం వద్ద జరిగిన సభకు సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కొల్లేరు సరస్సును ఐదవ కాంటూరు వరకు కొనసాగించాల్సిందేనన్నారు. బుడమేరు ముఖ ద్వారం నుంచి ఉప్పుటేరు వరకు పూడిక పనులు చేసి ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజన్ సర్కార్ ప్రజా సమస్యలను ఎందుకు పరిష్కరించడంలేదంటూ ప్రశ్నించారు. 2006లోనే సుప్రీంకోర్టు కొల్లేరు పరిరక్షణకై తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. కొల్లేరు ప్రాంతాల్లోని ప్రజలు కొల్లేరులో చేపలు పట్టుకుని అమ్ముకోవాలంటే రోడ్డు మార్గం కూడాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సుప్రీంకోర్టు అధికారులమంటూ ఫోన్‌కాల్

కేసు నమోదైందని, ష్యూరిటీ బెయిల్‌కు సొమ్ము చెల్లించాలని డిమాండ్

రిటైర్డ్ ఉద్యోగి నుంచి రూ.16 లక్షల 55 వేల అపహరణ

ఏలూరు క్రైం, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఏలూరుకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి తాము ఢిల్లీ నుంచి సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు నమోదైందని బెయిల్ పెట్టుకుని వెంటనే ష్యూర్టీ తీసుకోకపోతే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందాలు వస్తాయని భయభ్రాంతు లకు గురి చేసి ఏకంగా 16 లక్షల 55 వేల రూపాయలను తమ అకౌంట్‌లో వేయించు కున్నారు. అంతేకాకుండా బెయిల్‌కోసం మరో ఐదు లక్షలు జమ చేయాలని బెదిరించడంతో అనుమానం కల్గిన ఆ ఉద్యోగి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం ఏలూరు ఆర్‌ఆర్‌పేటలోని అక్కినేని రెసిడె న్స్‌లో నివాసం ఉంటున్న చెందిన కాకరపర్తి ఉదయశంకర్ న్యూ ఇండియా ఎష్యూరెన్స్ కంపెనీలో పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయ నకు ఒక గుర్తు తెలియని నెంబర్ నుంచి కాల్ రావడంతో లిఫ్టు చేశారు. తాము సుప్రీంకోర్టు ఉద్యోగులమని మీపై కేసు ఫైల్ అయిందని వెంటనే అరెస్టు చేయడానికి ప్రత్యేక బృందా లు వస్తున్నాయని వారిని ఆపాలంటే వెంటనే ష్యూరిటీ సొమ్ము చెల్లించాలని నాలుగు దఫా లుగా గత రెండు రోజుల నుంచి 16 లక్షల 55 వేల రూపాయలను వివిధ అకౌంట్లో వేయించుకున్నారు. అంతేకాకుండా బెయిల్ కోసం మరో 5 లక్షల రూపాయలు ఫీజు చెల్లించా లని భయభ్రాంతులకు గురిచేయడంతో తాను మోసపోయానని గుర్తించి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వైవీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దిష్టి రాళ్లకు చెక్

- సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేర్ల తొలగింపు
- కొద్దిరోజుల్లోనే పనులు ప్రారంభం



ఏలూరు రూరల్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీసర్వేలో పాతిన హద్దు రాళ్లు దిష్టిబొమ్మలుగా పడి ఉన్నాయి. వాటిపై జగన్ బొమ్మలు, పేర్లను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. ఎక్కువ నిధులు ఖర్చు చేయకుండా బొమ్మలు, పేర్లు చెరిపివేయాలని రెవెన్యూశాఖకు సూచించింది. వారం, పదిరోజుల్లో సరిహద్దు రాళ్లను సాఫీగా మార్చేందుకు రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైంది. శ్యాండ్‌వాష్ టెక్నాలజీని వినియోగించాలని భావిస్తోంది. ఒకవేళ ఖర్చుతో కూడుకున్నట్లయితే మాన్యువల్‌గా చేసేవారికి పనిని అప్పగించాలని యోచిస్తోంది. భూముల రీసర్వే కార్యక్రమానికి గత వైసీపీ ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంగా పేరు పెట్టి అమ ల్లోకి తీసుకొచ్చింది. జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అమలుచేసి ఆ తరువాత గ్రామాలకు ఈ కార్యక్రమాన్ని విస్తరిం చారు. సాధారణంగా ఏవైనా భూములు సర్వేని ప్రభుత్వం చేపడితే హద్దురాళ్లపై ఎటువంటి పేర్లు, బొమ్మలు వేయదు. టైటిల్ డీడ్‌పైనే భూ హక్కుదారు పేరు మాత్రమే ఉంటుంది. అటువం టిది వైసీపీ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా టైటిల్ డీడ్‌పై జగన్ ఫొటోలను ముద్రించి మరో వైపు భూముల హద్దు రాళ్లపై జగన్ ఫొటోలు, పేర్లు, వైసీపీ రంగులు అద్దింది. దీనిని పలువురు భూయజమానులు అభ్యంతర పెట్టినా పరిగణనలోకి తీసుకోలేదు. టైటిల్‌డీడ్, హద్దురాళ్లపై ఫొటోలతో అవి జగన్‌కు చెందిన ఆస్తులుగా ఉన్నట్లు చిత్రీకరణ జరిగింది. ఎన్నికల ముందు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లింది. మీ ఆస్తులపై జగన్ ఫొటోలు, పేర్లు ఏంటి మళ్ళీ అధికారంలోకి వస్తే వీటిని కొట్టేసినా, తాకట్టు పెట్టినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని హెచ్చరించాయి. దీంతో ప్రజల్లో తమ భూములు లాక్కుంటారన్న భయం ఏర్పడింది. ఏలూరు జిల్లాలో పలు మండలాల్లో సుమారు 70 వేలకు పైగా హద్దురాళ్లను పాతినట్టు రెవెన్యూ అధికారులు గుర్తించారు. వాటిని తొలగించేందుకు ఒక్కో రాయికి రూ.15 వరకు ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం టెండర్లు నిర్వహించి కాంట్రాక్టర్‌ను ఎంపిక చేస్తారు. అనంతరం హద్దురాళ్లపై జగన్ బొమ్మలు, పేర్లను సమూలంగా తొలగిస్తారని రెవెన్యూ, సర్వే అధికారులు తెలిపారు.

శివాలయాల్లో పౌర్ణమి పూజలు


అల్లూరులో జ్వాలాతోరణం


కైకలూరులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు


అలంకరణలో బలివే శ్రీ రామలింగేశ్వరస్వామి


చనుబండ రామాలయంలో అయోధ్య కోటి దీపోత్సవానికి వత్తులు తయారు చేస్తున్న భక్తులు


బలివేలో శివలింగాకృతిలో కార్తీక దీపాలు

నూజివీడు టౌన్/చాట్రాయి/ముసునూరు, కలిదిండి /ముదినేపల్లి/ కైకలూరు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈసందర్భంగా నూజివీడు కోట శివాలయం, దుర్గామల్లేశ్వర ఆలయంలో భక్తులు తెల్లవారు జాము నుంచి కార్తీక దీపారాధనలు చేసేందుకు ఆలయాలకు తరలివెళ్లడంతో దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చాట్రాయి, సి గుడిపాడు, తుమ్మగూడెం శివాలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపి కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీలు భక్తులకు అవసరమైన ఏర్పాటు చేశారు. బలివే శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామున 4గంటల నుంచి స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించి, అలంకరణ చేశారు. భక్తులు కార్తీక దీపారాధనలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. రాత్రి స్వామివారి సన్నిధిలో ఏలూరుకు చెందిన వేల్పుల సురేష్ ఆధ్వర్యంలో శివలింగాకృతిలో లక్ష దీపారాధనలు చేశారు.

కోటి దీపోత్సవానికి వత్తులు

చాట్రాయి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): అయోధ్యలో త్వరలో జరిగే 3వ విడత కోటి దీపోత్సవానికి అపర భద్రాద్రి చనుబండ శ్రీకోదండ రామస్వామి ఆలయం నుంచి నూనెలో తడిపిన వత్తుల పంపటానికి ఏర్పాట్లు ప్రారంభించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు ఆలయంలో జైశ్రీరామ్ నామాన్ని జపిస్తూ వత్తులను తయారు చేశారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్న కేశవరెడి ఆధ్వర్యంలో ఈ మహత్తర కార్యక్రమం జరుగుతున్నది.

కన్నుల పండువగా కృత్తికా దీపోత్సవం

ఆగిరిపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనగిరిపై వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో నిత్యహోమం, వసంతోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి జరిగింది. సాయంత్రం జరిగిన కృత్తికా దీపోత్సవం, స్వామివారి కల్యాణం, ధ్వజారోహణంలో ఉభయ దాతలుగా యండూరు నరసింహమూర్తి దంపతులు కైంకర్యపరులుగా పాల్గొన్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి ఆలయం, కోరుకొల్లు సోమేశ్వరస్వామి ఆలయం, పెదలంక నాగేశ్వరస్వామి ముదినేపల్లి మండలం గురుజ రామలింగేశ్వరస్వామి, వడాలి విశ్వేశ్వరస్వామి, అల్లూరు పార్వతీ సమేత సోమేశ్వరస్వామి, పెదగొన్నూరు మల్లేశ్వరస్వామి, సింగరాయపాలెం అమృతేశ్వరస్వామి దేవస్థానం, కైకలూరు శ్యామలాంబ ఆలయంలోని పార్వతీ సమేత రామలింగేశ్వర, రామేశ్వర స్వామి వార్లకు భక్తులు పంచామృతాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. జ్వాలా తోరణం నిర్వహించారు. ముదినేపల్లిలోని పెదరామాలయం వద్ద భక్తులు వెంకటేశ్వరస్వామి నామాల రూపంలో సహస్ర దీపారాధన నిర్వహించారు.



ఆగిరిపల్లిలో పుస్తక ప్రదర్శన... కైకలూరు గ్రంథాలయంలో పుస్తక పఠనం

పుస్తక పఠనంతో మేధస్సు పెంపు

ముదినేపల్లి/ కలిదిండి/ మండవల్లి/ కైకలూరు/ఆగిరిపల్లి/ముసునూరు/చాట్రాయి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనం మేధస్సును పెంచుతుందని ముదినేపల్లి తహసీల్దార్ ఎస్‌కె.సుభానీ అన్నారు. ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్య - మన భవిష్యత్ అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కలిదిండి, కోరుకొల్లు గ్రంథాల యాల్లో గ్రంథాలయాధికారులు జె.రమేష్, రాఘవులు ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండవల్లి శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఎస్‌ఐ రామ చంద్రరావుతో కలిసి బ్యాంకు మేనేజర్ జ్యోతి ప్రసాద్, సామాజిక కార్యకర్త భాస్కరరావు ప్రారంభించారు. మండవల్లి పంచాయతీ కార్యదర్శి కొండలరావు పాల్గొన్నారు. కైకలూరులో వివిధ రకాల పుస్తకాలతో పాటు స్వాతంత్ర్య సమర యోధుల చరిత్రను తెలిపే పుస్తకాలను ప్రదర్శన చేశారు. కైకలూరు కొత్తపేటలోని ఉర్దూ పాఠశాలకు చెందిన విద్యార్థులు పాల్గొ న్నారు. సాహితీ మిత్రుల ప్రధాన కార్యదర్శి చింతపల్లి వెంకట నారాయణ, ఉపాధ్యాయులు ఎండీ జకావుల్లా, పి.భాగ్యలక్ష్మీ, ఎ. శ్రీలక్ష్మీ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పుస్తక పఠనం చేయడం వల్ల విజ్ఞానం పెరుగుతుందని సచివాలయ కార్యాదర్శి సుకుమార్ అన్నారు. గోపవరం, ముసునూరు శాఖ గ్రంథాలయాల్లో శుక్రువారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల వినియోగంతో వచ్చే అనర్థాలపై సివిల్ అసిస్టెంట్ సౌమ్య అవగహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాముల గంగధరరావు, గ్రంథాలయ అధికారులు సునీల్‌కుమార్, టి.రాజేశ్వరి, వెల్ఫేర్ అసిస్టెంట్ డి.యోనా, సివిల్ అసిస్టెంట్ వీరబద్రరావు, ఏఎన్‌ఎం శకుంతల పాల్గొన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా చనుబండ శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విశ్వభారతి, లైబ్రేరియన్ శ్రీకాంత్ పాల్గొన్నారు. ఆగిరిపల్లి శాఖ గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కె.యోహాను, జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్, శ్రీ.కె. ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. బాలల్లో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించుట ద్వారా లక్ష్య సాధన దిశగా విద్యార్థులు అడుగులు వేయగలుగుతారని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సీనియర్ సేల్స్ ఆఫీసర్ కుమారి, వి.సుమేధ అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా తోటపల్లిలో గల హీల్ పారడైజ్ చిల్డ్రన్స్ హోంలో భాగ్యలక్ష్మి ఇండెన్ గ్యాస్ ఆగిరిపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన సేఫ్టీక్లీనింగ్, బాలల దినోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలబాలికలకు పలు పోటీల్లో గెలుపొందిన 34మందికి ఇండెన్ గ్యాస్ అధినేత పాలడుగు శ్రీనివాసరావు, మేనేజింగ్ పార్టనర్ పి.మాధవి బహుమతులు అందచేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న టౌన్ సీఐ సత్య శ్రీనివాస్

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆశల సాధనకు ప్రణాళికాబద్ధంగా విద్యార్థులు ముందుకు సాగాలని నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ అన్నారు. నూజివీడు ఎంటీ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని అన్నారు. బాలికలు, మహిళా సంరక్షణకు అభయ మహిళా రక్షణ దళాన్ని ఏర్పాటు చేశారని అన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

ముసునూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల భవిష్యత్‌లో అనేక అనర్థాలు ఎదురవుతాయని ప్రిన్సిపాల్ కె.ప్రవీణ అన్నారు. శుక్రువారం ముసునూరు గురుకుల బాలికలకు ఐసీడీయస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలతో వచ్చే అనర్థాలపై అవగహన కల్పించారు. బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమన్నారు.

ముందస్తు పూతలకు సస్యరక్షణ చేపట్టాలి

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడిలో ముందస్తు పూతలు వచ్చేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మామిడి పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త బి.కనకమహాలక్ష్మి సూచించారు. బోరవంచ గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మొదటి పిచికారిలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, బ్లాక్ సల్ఫర్ 3 గ్రాములు, బోరాన్, జింక్‌లను 2 గ్రాములు క్లోరిపైరిపాస్ ఒక మిల్లీమీటర్ కలిపి పిచికారి చేయాలని తెలిపారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు మర్లపాలెం విద్యార్థినులు

చాట్రాయి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ అండర్-17 రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మర్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు కె పవిత్ర, పి.హర్షిత ఎంపికైనట్లు పీడీ సతీష్‌కుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను హెచ్‌ఎం బక్కయ్య, విద్యా కమిటీ చైర్మన్ శ్రీలత, స్టాఫ్ సెక్రటరీ రఘు, సీనియర్ ఉపాధ్యాయుడు తిరుపతయ్య అభినందించారు.

తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): వరిధాన్యం కొనుగోలుకు నూజివీడు మండలంలో 9 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు నూజివీడు వ్యవసాయశాఖ అధికారిణి ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రెండు పీఏసీఎస్‌ల నిర్వహణలో ఉండగా, మిగిలినవి డీసీఎమ్ఎస్‌ల నిర్వహణలో ఉన్నాయన్నారు. రైతుల సౌకర్యం కోసం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో 33,500 గోనెసంచులను అందుబాటులో ఉంచటం జరిగిందని, ధాన్యం మద్దతు ధరను రాష్ట్రప్రభుత్వం రూ2,230 లుగా ప్రకటించిందన్నారు. నూజివీడు మండలంలో పల్లెర్లమూడి, జంగంగూడెం, తుక్కులూరు, పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు, దిగవల్లి, అన్నవరం, సుంకొల్లు, పాతరావిచర్ల గ్రామాల్లో ధాన్యంకొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

మాలధారులకు అన్నదానం

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో శుక్రవారం అయ్యప్ప, భవానీ మాలధారులకు కార్తీక అన్నదానం జరిగింది. గురుస్వామి నీలం నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో బాబాకు, అయ్యప్ప స్వామికి పూజలు చేసి అనంతరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చీదెళ్ల సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు సుమారు 600 మంది సర్వమాలధారులకు అన్నదానం నిర్వహిం చారు.

బీజేపీని బలోపేతం చేయాలి

నూజివీడు, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా బీజేపీ బలోపేతానికి పోలింగ్ బూత్ కమిటీల నిర్మాణం చేపట్టినట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ తెలిపారు. బీజేపీ క్రియాశీలక సభ్యత్వాలు, పోలింగ్ బూత్ కమిటీల ఎన్నిక కార్యాచరణకై నూజివీడు పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నూజివీడు పట్టణ బీజేపీ అధ్యక్షుడు బోనుఅప్పారావు అధ్యక్షతన నిర్వహించారు.

టీడీపీతోనే అభివృద్ధి

ముసునూరు, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నియోజకవర్గ తెలుగుయువత కార్యాదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), క్లస్టర్ ఇన్‌చార్జ్ గార్లపాటి నరసింహరావు అన్నారు. శుక్రవారం ముసునూరు బీసీకాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను, వార్డు సభ్యుడు నల్లిబోయిన రాంబాబు, రెడ్డి కృష్ణ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణం..

చాట్రాయి, నవంబరు 15(ఆంధ్రజ్యోతి): పురాతన కోనేరు ఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. పనులకు చనుబండ వాస్తవ్యులు జంగాల శ్రీనివాసరావు, లక్ష్మీ దంపతుల కుమారుడు, ఖమ్మం జీవన రేఖ చిన్న పిల్లల హాస్పటల్ అధినేత డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ స్రవంతి దంపతుల విరాళంతో చేపట్టారు.

నేడు ఎంపీ మహేశ్ పెదపాలపర్రు రాక

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ శనివారం ముదినేపల్లి మండలంలో పర్యటించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి తెలిపారు. పెదపాలపర్రులో ఆయన శనివారం సాయంత్రం 4 గంటలకు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొంటారు. మండల టీడీపీ సమావేశంలో ఎంపీతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పాల్గొంటారని తెలిపారు.

ముదినేపల్లిలో సహకార వారోత్సవాలు



ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ముదినేపల్లి బ్రాంచి పరిధిలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాలు జరుగుతున్నాయి. బ్రాంచి పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద సహకార వారోత్సవాల జెండాలను ఆవిష్కరించి శుక్రవారం సహకార రంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతికత అనే అంశంపై కార్యక్రమాలను నిర్వహించారు. ముదినేపల్లి సహకార బ్యాంక్ బ్రాంచ్ వద్ద బ్రాంచి మేనేజర్ వి.సత్యకుమార్ జెండాను ఆవిష్కరించారు.

17 వేల మంది ఓటర్ల గుర్తింపు

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలంలో వివిధ ఇరిగేషన్ ఛానల్స్ ఆయకట్టు వారీగా 12 సాగునీటి వినియోగదారుల సంఘాల ఏర్పడ్డాయని తహసీల్దార్ ఎస్.కె.సుభానీ తెలిపారు. సంఘాల పరిధిలో 17,020 మంది సాగుదార్లయిన రైతులను ఓటర్లుగా గుర్తించినట్టు తెలిపారు. ముదినేపల్లి, పెదగొన్నూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 12 ప్రాదేశిక నియోజకవర్గాలు ఏర్పాటు కాగా, ప్రతీ సంఘానికి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని ఓటర్లయిన సాగుదారులు ఎన్నుకుంటారని తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఒకరికి ఆరు నెలలు జైలు శిక్ష విధిస్తూ నూజివీడు ప్రత్యేక న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. నూజివీడుకు చెందిన చిక్కవరపు దమయంతమ్మ 2019 అక్టోబరులో సుబ్రహ్మణ్యంకు రూ.5లక్షల నగదు అప్పుగా ఇచ్చారు. బాకీ చెల్లించమని కోరగా 2020 అక్టోబరులో రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చాడు. చెక్కు బౌన్స్ అయ్యింది. దీంతో ఆమె కోర్టును ఆశ్రయించగా విచారించిన న్యాయమూర్తి సుబ్రహ్మణ్యంకు ఆరు నెలల జైలు శిక్ష, ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

యువకుడిపై వేధింపుల కేసు నమోదు

ముదినేపల్లి, నవంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల తనపై కొంతమంది దాడికి పాల్పడి అసభ్యంగా ప్రవర్తించి వేధించారని మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ చేసిన ఫిర్యాదుపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 4న అదే గ్రామానికి చెందిన క్రాంతి అనే యువకుడు మరికొందరితో వచ్చి తనను బలాత్కారం చేయబోగా, తాను కత్తి చూపించి బెదిరించగా పారిపోయారని ఆమె ఫిర్యాదు చేసింది. దర్యాప్తు అనంతరం క్రాంతిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ వీరభద్రరావు తెలిపారు. కాగా ఘటన వివరాలు తెలుసుకునేందుకు ఆమె ఇంటికి వెళ్లిన తనను కత్తితో పొడిచి గాయపర్చినట్టు బూసి సంజీవయ్య అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు ఆ మహిళపై కూడా కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.